# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

మే / May - 2022

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / Vol. 98 | మే/May - 2022 | సంచిక/No.5

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – శ్రీ ఆదిశంకరాచార్యులు | 2 |
| 2. | ధ్యానము – హస్తమలక | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ–అనువాదం:శ్రీమతి బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | భగవత్ కృప – శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ | 5 |
| 5. | భీష్మ స్తవరాజము – శ్రీ మహాభారతము | 7 |
| 6. | సింహ గర్జన – అనువాదం : గరిగిపాటి కృష్ణ | 11 |
| 7. | తత్వమసి – శ్రీ తెన్నేటి విశ్వనాథం | 12 |
| 8. | శ్రీ తులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి | 16 |
| 9. | మాతాజీ అపూర్వం – బన్ను | 19 |
| 10. | పరిత్రాణములు – బోధ చైతన్య | 20 |
| 11. | రసిక కుమార చరిత్రము – మహాభక్త విజయం | 22 |
| 12. | కార్యక్రమములు, విరాళములు | 26 |

* ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.

జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–

# ప్రార్థన

## శ్రీ ఆదిశంకరాచార్య విరచిత లక్ష్మీ నృసింహ స్తోత్రం

**ప్రార్థన ద్వారా మనస్సు స్వాధీన మగును**

**శ్లో॥ సంసార వృక్ష, మఘ బీజ, మనంత కర్మ**
**శాఖాయుతం, కరణ పత్ర, మనంగ పుష్పం**
**ఆరుహ్యా దు:ఖ ఫలినం, పతతో దయాలో,**
**లక్ష్మి నృసింహా! మమ దేహి కరావలంబం॥**

**భావము :** ఓ లక్ష్మీ నృసింహ స్వామీ ! పాప మనెడి బీజము నుండి సంసార వృక్షము ఆవిర్భవించి నది. తుదిలేని కర్మలే దీని కొమ్మలు. ఇంద్రియములే ఆకులు. కామములే సుమములు. దుఃఖమే దీని ఫలము. దేవా! నేనీ చెట్టు నెక్కి పతితుడ నగుచున్నాను. దయానిధీ! నాకు చేయూత నొసంగుము.

# ధ్యానము

## హస్తమలక స్తోత్రము

**స్వాధీనమైన మనస్సు ధ్యానమునకు సోపానమవుతుంది**

**నిమిత్తం మన చక్షురాది ప్రవృత్తా**
**నిరస్త అఖిల ఉపాదిః ఆకాశకల్పః ।**
**రవిః లోక చేష్టాం నిమిత్తం యధా యః**
**సః నిత్య ఉపలబ్ధి స్వరూపః అహం ఆత్మా ॥**

మనస్సు ఇంద్రియాలు, ఈ సర్వ జగత్తు సక్రమముగా తమ తమ పనులు చేయుటానికి కారణము చైతన్యము, సూర్యునివలె కేవలము నిమిత్త కారణము చైతన్యము, అట్టి సర్వనిమిత్త కారణమై కూడ, అంతటిలోను అన్నిటిలోను అంతరముగా వున్న ఆకాశము, ఏ విధముగా వేటి గుణములను పొందకుండ నిర్గుణముగా వున్నదో, అదే విధముగా శుద్ధ చైతన్యము గూడ సర్వఉపాది గుణాలకు అతీతమై నిర్వికార సాక్షిమాత్రముగానున్నది. అట్టి నిత్య చైతన్య రూపమైన ఆత్మను నేను.

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అధ్యాయం - 38**

**మూలం : స్వామి ఓంకార్** **అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి**

## పరమాత్మయే తండ్రి

### తోటపల్లి కొండల్లో శ్రీ శాంతి ఆశ్రమము

నేను వేల మైళ్ళ దూరంలో ఉన్న అమెరికా దేశంలో ఉన్నప్పుడు కూడా నా మాతృ సంస్థ తోటపల్లి కొండల్లో నెలకొన్న శ్రీ శాంతి ఆశ్రమంతో ఎన్నడూ సంబంధాలు తెగిపోకుండా జాగ్రత్త వహించాను. అమెరికా దేశంలో మేము స్థాపించిన శాంతి కేంద్రాలన్నీ కూడా మాతృసంస్థకు అనుబంధ సంస్థలుగానే వ్యవహరించేవి. అమెరికాలో ధ్యాన తరగతులకు వచ్చే విద్యార్థులు, ఇంకా అనేకమంది విదేశీ భక్తులు భారతదేశానికి వచ్చి మాతృసంస్థ అయిన శాంతి ఆశ్రమాన్ని దర్శించాలనుకున్నారు. మరికొంత మంది పాశ్చాత్య దేశాన్ని పూర్తిగా వదిలిపెట్టి శాశ్వతంగా శాంతి ఆశ్రమంలోనే తమ శేష జీవితాన్ని ఆశ్రమసేవకు వినియోగించాలని భావించారు. చాలా మంది ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చారు. కానీ కేవలం సుశీలాదేవి మాత్రమే తన జీవితాన్ని పూర్తిగా ఆశ్రమ సేవలకు, ప్రపంచ మానవాళి సేవలకు చాలా సంవత్సరాలు అంకితం చేయగలిగారు.

మద్రాసు నుండి రాజేశ్వరానంద స్వామి మాతృసంస్థ అయిన శాంతి ఆశ్రమానికి వచ్చి పీస్ పత్రికకు సంపాదకులుగా వ్యవహరించేవారు. నేను అమెరికాలో ఉన్న సమయంలో వారే పత్రికను నడిపించారు. ఆయన తనతో ఒక యువ బ్రహ్మచారి 'మహాదేవన్'ను కూడా ఆశ్రమానికి తీసుకువచ్చారు. ప్రస్తుతం వారు మద్రాసు విశ్వవిద్యాలయంలో వేదాంతము డిపార్టుమెంట్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన వేదాంతములో మంచి పాండిత్యం కలవారు కావటం చేత శంకరాచార్యుల వారి గ్రంథాలను అనువాదము చేసి వేదాంత మార్గాన్ని ఆధ్యాత్మిక జిజ్ఞాస కల పవిత్రాత్ములకు మార్గం సుగమం చేశారు. ఆశ్రమంలో నివసిస్తున్న ఆశ్రమ వాసులు, భక్త కుటుంబాల వారు నేను అమెరికాలో ఉన్న సమయంలో ఆశ్రమం అభివృద్ధికి ఇతోధికంగా వారి సహాయ సహకారాలు అందించటం వలన భగవంతుని అనుగ్రహంతో ఆశ్రమం చాలా అభివృద్ధిలోనికి వచ్చింది.

మండువేసవిలో చల్లని గాలి కోసం తాటి ఆకులతో చేసిక విసనకర్రతో విసురుకున్నట్లుగా ఉంటుంది మానవుని ప్రయత్నాలు. కాని భగవంతుని సంకల్పంతో పనులు జరిగినప్పుడు మాత్రం చల్లని, ఆహ్లాదకరమయిన ప్రకృతి సహజమయిన గాలులు వీచినట్లుగా వాతావరణమంతా ఆ చల్లని గాలులతో నిండిపోతుందని పెద్దలు అంటూ ఉంటారు. కాబట్టి రోజు రోజుకి చూస్తుండగానే ఆశ్రమం ఇంతగా పురోభివృద్ధిని, ప్రగతిని సాధించటం వెనుక కేవలం మానవ ప్రయత్నం కాకుండా భగవంతుని అనుగ్రహము, ఆశీర్వాదములు పనిచేశాయని చెప్పక తప్పదు. ఆధ్యాత్మిక ప్రపంచ చరిత్రలో ఒక నూతన అధ్యాయం సృష్టించడానికే ఈ ఆశ్రమము నెలకొల్పబడింది. ఈ శాంతి కేంద్రము మానవులందరిని ఏకం చేయడానికి, కులాలన్నింటిని ఒక్కటిగా కలపడానికి, దేశాల మధ్య నున్న అంతరాలను తొలగించడానికి, సత్యాన్వేషకులకు ఆత్మశాంతి కల్గించడానికి, వారందరికి చక్కని ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చడానికి ప్రపంచంలోని ప్రతి వ్యక్తి హృదయంలో శాంతిని నెలకొల్పడానికి పనిచేస్తుంది.

ఒక్కడే దైవము, మానవాళి అంతా ఒక్కటే. అందరికి ఆ పరమాత్మయే తండ్రి. ప్రపంచంలోని మానవులందరూ సహోదరులు అన్నది ఆశ్రమానికి పునాది వంటిది. తోటపల్లి కొండల్లో ఆశ్రమము ప్రారంభించిన మొదటి రోజునుండి కూడా ఈ సదాశయాలతోనే ఆశ్రమాన్ని అభివృద్ధి చేయటం జరిగింది.

తుప్పలు, ముళ్ల చెట్లు అన్నీ నరికి చదును చేయబడ్డాయి. అడవి ప్రాంతము అందమయిన ప్రార్థనా మందిరాలుగా, ధ్యాన కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయి. సత్యాన్వేషణకులకు, సాధకులకు, జిజ్ఞాసువులకు, ఆర్తులకు, తూర్పు పడమర దేశాల్లోని భక్తిమయ హృదయము కలవారందరికి సహాయం చేయడానికే ఈ ఆశ్రమ నిర్మాణం జరిగింది. ఆధ్యాత్మికంగా మహోన్నత స్థితిని సాధించిన మహాత్ములు ఎందరో ఆశ్రమాన్ని దర్శించి, ఎలాంటి ఆర్భాటము లేకుండా ప్రశాంతంగా జరుగుతున్న ఆశ్రమ కార్యకలాపాలను గమనించి అభినందించారు. అలాంటి వారు ఆశ్రమంలో ప్రశాంతంగా కొన్ని రోజులు సాధనలో గడిపి వెళ్ళేవారు. శ్రీ రామతీర్థ గారికి ప్రత్యక్ష శిష్యుడయిన శ్రీ నారాయణ స్వామి గారు ఆశ్రమాన్ని దర్శించినప్పుడు అతిథులు వారి అభిప్రాయాలను వ్రాసే పుస్తకంలో ఈ విధంగా వ్రాశారు.

"నేను ఆశ్రమము అంతా తిరిగి జాగ్రత్తగా పరిశీలించాను. అది సాధనకు చాలా అనుకూలంగా ఉంది. ఆశ్రమములోనూ, చుట్టూ ఉన్న తోటపల్లి కొండల్లోనూ తిరిగి చూచినప్పుడు నా హృదయము ఆనందంతో నిండిపోయింది. శాంతి ఆశ్రమము స్థాపకులు ఎన్నో ప్రయత్నాలు చేసినందుకు వారు అభినందనీయులు. ఆధ్యాత్మికోన్నతి పొందిన మహనీయులు వారి సహాయ సహకారాలు అందించడానికి అర్హులు అయినారు. స్వామి వారి శిష్యులు ప్రత్యేకంగా వారి సహకారం తప్పక అందిస్తారు."

మహాయాన బుద్ధిస్ట్ మిషన్, లండన్ సంస్థ అధ్యక్షులు గొప్ప తపస్వి అయిన 'అనగామిమైన్' గారు ఇలా వ్రాశారు."అడవి సుందరమైన ఉద్యానవనంగా మారిపోయింది. అక్కడ నిజమయిన ప్రేమ, ఆనందం, ఎల్లలు లేని సంతోషం దొరుకుతాయి. ఇవి శరీరానికే కాక ఆత్మకు కూడా ఆనందాన్ని కల్గిస్తాయి". శ్రీ వేలుముదలియార్, అడ్వకేట్ మరియు అధ్యక్షులు పెద్దాపురం తాలూకా బోర్డ్ వారు ఈ విధంగా వ్రాశారు.

"ఈ ఆశ్రమము యువకులకు తర్ఫీదునిచ్చే ప్రదేశంగా, మధ్య వయస్కులకు ఆశాజ్యోతిగా, పెద్దవారికి సాధనా కేంద్రంగా ఉపయోగపడుతుంది".

రివరెండ్ ఆర్థర్ స్కాట్, కెనడా దేశస్థుడు బాపిస్టు మిషన్, తుని శాఖ అధ్యక్షుడు ఈ విధంగా వ్రాశారు.

"ఇక్కడికి వచ్చిన ప్రతి వ్యక్తి శాంతిని పొందుతాడు. తాను పొందిన శాంతిని ఇతరులకు అందించడానికి ప్రయత్నిస్తాడు. నా గురించి చెప్పాలంటే, జీసస్ క్రీస్తు శిష్యులందరి తరుపున చాలా సంతోషంగా చెపుతున్నాను, నేనక్కడ చాలా మనశ్శాంతిని పొందాను. పాపాలన్నీ కడిగి వేయబడినాయి. నా ఆత్మకు పూర్తి శాంతి చేకూరింది."

భారతదేశంనుండే కాకుండా, ఇతర దేశాలనుండి వచ్చిన వివిధ సంప్రదాయాలకు చెందిన మహాత్ములు, మేధావుల్లో కొందరి అభిప్రాయాలను మాత్రము ఇక్కడ ప్రస్తావించాను. చాలా గొప్ప అభినందనలు కొద్ది సంవత్సరాల అనంతరము వెల్లువలా వచ్చాయి. ఆశ్రమము ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ప్రశాంతంగా, నెమ్మదిగా చేస్తున్న సేవలకు తగిన ఆశీర్వచనాలు భగవంతుని అనుగ్రహము వలన లభించాయి. ఆయన ఎల్లప్పుడూ తన బిడ్డల యోగ క్షేమాల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆ విధంగా వారిని తనకు దగ్గరకు చేర్చేందుకు మార్గాన్ని ఏర్పరచి అక్కున చేర్చుకుంటాడు.

# భగవత్ కృప

**మూలం : శ్రీ అఖండానంద సరస్వతీ** **అనువాదం : శ్రీమతి టి. ఛాయాకృష్ణ**

గత సంచిక తరువాయి

## భగవంతుడు అనంత గుణములు కలిగిన వాడు

శ్రీ శుకదేవుడు పరీక్షితునితో నిట్లనియె రాజా! ఎప్పుడైతే భగవంతుడిట్లు పలికాడో బలి నేత్రముల నుండి అశృవులు ధారలు కట్టినవి. అప్పుడు చేతులు జోడించి భక్తితో గద్గద కంఠంతో ఇట్లనెను – ప్రభో! నేను మీకు సరిగా ప్రణామము కూడ చేయలేదు. కానీ మీరు మీ భక్తుని రక్షణ కొరకు, సర్వదా తత్పరులై వుంటారు. నన్ను మీ శరణాగతునిగా చేసుకోమని నా అహంకారమును భంగం చేయండనీ, నన్ను నీ వాడిగా చేసుకోమని నేను మిమ్ములనెప్పుడు ప్రార్థించనే లేదు.

చూడండి! ఎప్పుడైన భగవంతుని ఎవరైనా ప్రార్థిస్తే అప్పుడు భగవంతుడు ఆ ప్రార్థన పూర్తి చేస్తాడు – అది అతని మర్యాద, ధర్మము. ఎవరైనా తమను రక్షించమని ప్రార్థిస్తే అప్పుడు భగవంతుడు వారిని రక్షిస్తాడు. ఇది అతని నియమము. 'రక్షాపేక్షామ పేక్షతే' కానీ బలి భగవంతుని ఏమీ ప్రార్థించలేదు. భగవంతుడు స్వయముగా అతని వద్దకు వెళ్ళాడు. అతనిని యాచించినవాడు అతనిని అనుగ్రహించి అతనిని తనవానిగా స్వీకరించినాడు. శాశ్వతంగా అతని కాపలాదారుడైనాడు. అందువలననే బలి అన్నాడు 'భగవన్! నా లాంటి నీచుడైన ఒక అసురుని పైన మీరు చూపిన అనుగ్రహము అది జగత్తులో ఏ దేవత కూడ పొందలేదు –

**అమరైరలబ్ధపూర్వో పనదే సురేర్పితః ॥2॥**

దీని తర్వాత బలి భగవంతునికి, బ్రహ్మకు, శివునికి నమస్కరించి సుతలలోక మునకు వెళ్ళిపోయాడు. అటు భగవంతుడు ఇంద్రుని వద్దకు వెళ్ళి, తీసుకోనీ స్వర్గ పదవిని' అని అన్నాడు. అదితి యొక్క కోరిక తీరినది. ఇంద్రుడు త్రిలోకములను శాసించసాగినాడు.

ఎప్పుడైతే ప్రహ్లాదుడు తన మనుమడికి భగవంతుడు ప్రసాదించిన అనుగ్రహమును చూచాడో అప్పుడు భక్తిప్రవణుడై ఈ విధముగా స్తుతి చేయసాగాడు– ప్రభో! మీ ఈ కృపా ప్రసాదము బ్రహ్మకు కానీ, లక్ష్మికి కానీ, శివునికి కానీ లభించలేదు. యన్నో సురాణామసి దుర్గ పాలః (6) మీరు అసురుల నగర రక్షకులైనారు. దుర్గపాలురైనారు. సకలలోకములు మీకు నమస్కరించుచున్నవి. అసలు మీ లీల అనిర్వచనీయమైనది. మీరు సర్వాత్ములు సమదర్శులు అయినా కూడ మీ భక్తుల కొరకు విషమ స్వభావులై పక్షపాతము చూపించుచున్నారు. కల్పవృక్షము లాంటిది మీ స్వభావము.

భగవంతుడు ప్రహ్లాదునితో నీవు కూడ వెళ్ళి నీ పౌత్రుడి వద్ద సుతలలోకములో వుండు. అక్కడ చేతిలో గదను పట్టుకుని నీ మనుమని రక్షణకై నియక్తుడినై వున్న నన్ను దర్శించెదవు. 'నిత్యం ద్రష్టాసి మాం తత్ర గదాపాణి–మవస్థిమ్' (10) నాదర్శనము వలన నీకు పరమానంద ప్రాప్తి కలుగుతుంది. నీ కర్మ బంధనములు తెగిపోతాయి అని చెప్పాడు. ప్రహ్లాదుడు భగవంతునికి ప్రదక్షిణము చేసి తన పౌత్రుడు బలి దగ్గరికి వెళ్ళిపోయాడు. తర్వాత భగవంతుడు శుక్రాచార్యునికి యజ్ఞములను పూర్తి చేయమని ఆదేశించినాడు. కర్మ చేయడములో కర్తవలన ఏదైన తృటి జరిగివుంటే బ్రాహ్మణుల కపృతో అదిపోతుంది –

**యత్ తత్ కర్మను వైషమ్యం। బ్రహ్మ దృష్టం నమం భవేత్॥ (14)**

శుక్రాచార్యుడు అన్నాడు – ప్రభో! ఏ యజ్ఞములో మీరు స్వయముగా విరాజమానులై వున్నారో, మీ పూజ జరిగినదో, మీరు సర్వం తీసుకున్నారో అక్కడ ఇక లోపము తృటి ఎక్కడుంటుంది? మహాత్ములు కర్మకాండ చేసేటప్పుడు మంత్ర–తంత్రములలో ఏమైన లోటు వుంటే, మీ నామ సంకీర్తనము చేస్తారు దాని లోటు పూర్తి చేయడానికి కర్మకాండలలో మంత్రభాగము వచ్చినప్పుడు పండితులు ఈ శ్లోకమును చెబుతారు –

**మంత్రతస్తంత్రతశ్ఛిద్రం దేశకాలార్హ వస్తుతః।**
**సర్వం కరోతి నిశ్ఛిద్రం నామసంకీర్తనం తవ॥ (16)**

ఎవరి నామ మాత్రంతో యజ్ఞం సంపూర్ణమవుతుందో, ఆ భగవంతునికే యజ్ఞములో పూజ జరిగితే ఇక ఆ యజ్ఞ పూర్తిని గురించి సందేహమెక్కడ? యజ్ఞమయితే పూర్తి అయినది. కానీ మీరు ఆదేశిస్తున్నారు. కాబట్టి మీ ఆజ్ఞను పాలించడమే మాకు పరమ కల్యాణకరము.

**ఏతచ్ఛ్రేయః పరం పుంసాం యత్ తవాజ్ఞానుపాలనమ్॥ (17)**

భగవంతుని ఆదేశాను సారము శుక్రాచార్యుడు యజ్ఞమును పూర్తి చేశాడు. భగవంతుడు బలిని భిక్షమడిగి ఇంద్రునికి స్వర్గమును తిరిగి ఇచ్చి వేశాడు. ఇంద్రుడు దేవతలతో కలసి నివసించసాగాడు. కశ్యపుడు అదితి యొక్క ప్రసన్నత కొరకు లోకపాలధిపతిగా వామనుని అభిషేకించినాడు. వామనుడు ధర్మాధ్మక్షుడైనాడు. ధర్మముతో ఇంద్రుడు, గోవిందుడయినాడు. ఇంద్రునికి చాల ఆనందం కలిగినది. మను, పితృలు, సిద్ధులు అందరూ భగవంతుని ప్రశంసించినారు. స్తుతి చేసినారు. పృథ్వి యొక్క కణకణమును లెక్కించవచ్చునేమోగానీ భగవద్ గుణానువాదములను లెక్కించలేము. ఈత్రివిక్రమ–అవతార చరిత్రము నెవరు శ్రవణము చేస్తారో వారికి పరమగతి ప్రాప్తమవుతుంది.

(సమాప్తం)

# భీష్మ ఉవాచ

## శ్రీ మహాభారతము

### భీష్మ స్తవరాజము

**(గత సంచిక తరువాత)**

**నమోస్తుతే మహాదేవ నమస్తే భక్తవత్సల।**
**సుబ్రహ్మణ్య నమస్తేస్తు ప్రసీదపరమేశ్వర॥**
**అవ్యక్త వ్యక్త రూపేణ వ్యాపం సర్వం త్వయా విభో।**
**నారాయణం సహస్రాక్షం సర్వలోకమహేశ్వరమ్ ॥**
**హిరణ్యనాభం యజ్ఞాంగమ్ అమృతం విశ్వతోముఖమ్ ।**
**ప్రపద్యే పుండరీకాక్షం ప్రపద్యే పురుషోత్తమమ్ ॥**

మహాదేవా ! నమస్కారం. భక్తవత్సలా ! నమస్కారం. సుబ్రహ్మణ్యా ! నమస్సులు. పరమేశ్వరా ! అనుగ్రహించు. నీవు అవ్యక్త రూపంలోనూ, వ్యక్తరూపంలోనూ కూడ విశ్వమంతటా వ్యాపించి ఉన్నావు. నారాయణుడు, సహస్రాక్షుడు, సర్వలోక మహేశ్వరుడు, హిరణ్యనాభుడు, యజ్ఞాంగ రూపుడు, అమృత స్వరూపుడు, విశ్వవ్యాప్తమయిన ముఖాలు కలవాడు అయిన పుండరీకాక్షుని, పురుషోత్తముని శరణుకోరుతున్నాను.

**సర్వదా సర్వకార్యేషు నాస్తి తేషామమంగలమ్ ।**
**యేషాం హృదిస్థో దేవేశః మంగలాయతనం హరిః ॥**

మంగళ నిలయుడయిన హరి మనసులో ఉన్నవారికి అన్నిపనులలోనూ, ఎన్నడూ అమంగళం కలగదు.

**మంగలం భగవాన్విష్ణుః మంగలం మధుసూదనః ।**
**మంగలం పుండరీకాక్షః మంగలం గరుడధ్వజః) ॥**

విష్ణువే మంగళరూపుడు – మధుసూదనుడే మంగళుడు. పుండరీకాక్షుడే శుభరూపుడు. గరుడధ్వజుడే శుభరూపుడు.

**యస్తనోతి సతాం సేతుమ్ ఋతేనామృతయోనినా ।**
**ధర్మార్థవ్యవహారాంగైః తస్మై సత్యాత్మనే నమః ॥ 50**

మోక్షకారణమయిన వేదోపాయంచేత ధర్మార్థవ్యవహారాలనే అంగాలతో సత్పురుషులకు సేతువు నిర్మించిన సత్యాత్మునకు నమస్సులు. (50)

**యం పృథగ్ధర్మచరణాః పృథగ్ధర్మఫలైషిణః ।**
**పృథగ్ధర్మైః సమర్చంతి తస్మై ధర్మాత్మనే నమః ॥ 51**

వేర్వేరు ధర్మపాదాలతో, వేర్వేరు ధర్మ స్వరూపాలతో, వేర్వేరు ధర్మఫలాలను కోరేవారు అర్చించే ధర్మస్వరూపునకు నమస్కారం. (51)

**యతః సర్వే ప్రసూయంతే హ్యసంగాత్మాంగదేహినః ।**
**ఉన్మాదః సర్వభూతానాం తస్మై కామాత్మనే నమః ॥ 52**

కామమయ శరీరాలు కలవారివల్ల ప్రాణులన్నీ జన్మిస్తున్నాయి. వాని వలననే సర్వభూతాలకూ ఉన్మాదం కలుగుతోంది. అటువంటి కామాత్మునకు నమస్కారం.(52)

**యం చ వ్యక్తస్థమవ్యక్తం విచిన్వంతి మహర్షయః ।**
**క్షేత్రే క్షేత్రజ్ఞమాసీనం తస్మై క్షేత్రాత్మనే నమః ॥ 53**

మహర్షులు ఈ దేహంలోనే అవ్యక్తుని గుర్తిస్తారు. బుద్ధిలో నిలిచిన క్షేత్రజ్ఞుని తెలుసుకుంటారు. అటువంటి క్షేత్రాత్మునకు నమస్కారం. (53)

**యం త్రిధా22త్మానమాత్మస్థం వృతం షోడశభిర్గుణైః।**
**ప్రాహుః సప్తదశం సాంఖ్యాః తస్మై సాంఖ్యాత్మనే నమః ॥ 54**

జాగ్రత్, స్వప్న, సుషుప్తులయందు స్వరూపంతో ఉన్నాకూడా ఆత్మను పదహారు గుణాలతో చుట్టిన పదునేడవ స్వరూపంగా సాంఖ్యులు చెపుతారు. ఆ సాంఖ్యాత్మునకు నమస్సులు. (54)

వి॥సం॥ షోడశగుణాలు = పంచకర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచభూతాలు, మనస్సు (నీల)

**యం వినిద్రా జితశ్వాసాః సత్త్వస్థాః సంయతేంద్రియాః ।**
**జ్యోతిః పశ్యంతి యుంజానాః తస్మై యోగాత్మనే నమః ॥ 55**

నిద్రను జయించి, శ్వాసను నిలిపి, సత్త్వస్థులై ఇంద్రియాలను వశపరచుకొని యోగనిర్వహణం చేస్తూ యోగులు చూసే జ్యోతిఃస్వరూపుడైన యోగాత్మునకు నమస్సులు. (55)

**అపుణ్యపుణ్యోపరమే యం పునర్భవనిర్భయాః ।**
**శాంతాః సన్న్యాసినో యాంతి తస్మై మోక్షాత్మనే నమః ॥ 56**

పాపపుణ్యాలు శమించి, పునర్జన్మ అనే భయంలేని శాంతులయిన సన్యాసులు ఎవనిని చేరుతారో ఆమోక్ష స్వరూపునికి నమస్కారం. (56)

**యో2సౌ యుగసహస్రాంతే ప్రదీప్తార్చిర్విభావసుః ।**
**సంభక్షయతి భూతాని తస్మై ఘోరాత్మనే నమః ॥ 57**

వేల యుగాలు గడిచిన తర్వాత మంటలు మండుతూ అగ్నిరూపంలో భూతాల నన్నిటినీ అతడే భక్షిస్తాడు. ఆ ఘోరాత్మునికి నమస్కారం. (57)

**సంభక్ష్య సర్వభూతాని కృత్వా చైకార్ణవం జగత్ ।**
**బాలః స్వపితి యశ్చైకః తస్మై మాయాత్మనే నమః ॥ 58**

అన్నిప్రాణులను భక్షించి, జగత్తు అంతా ఒకే సముద్రంగా చేసి, తానొక్కడూ బాలుడై నిద్రించే మాయాత్మునకు నమస్కారం. (58)

**తదస్య నాభ్యాం సంభూతం యస్మిన్విశ్వం ప్రతిష్ఠితమ్ ।**
**పుష్కరే పుష్కరాక్షస్య తస్మై పద్మాత్మనే నమః ॥ 59**

కమలాక్షుడయిన ఆవిష్ణుమూర్తి నాభికమలంలో విశ్వమంతా జన్మించింది. అందులోనే స్థిరంగా నిలిచింది. ఆ పద్మస్వరూపునకు నమస్కారం. (59)

**సహస్రశిరసే చైవ పురుషాయామితాత్మనే ।**
**చతుఃసముద్రపర్యాయయోగనిద్రాత్మనే నమః ॥ 60**

అనంతమైన శిరసులు, పరిధులు లేని ఆత్మలూ కల్గి, నాల్గుసముద్రాలు ఏకార్ణవమైనపుడు యోగనిద్రను పొందే యోగనిద్రాత్మకునకు నమస్కారం. (60)

**యస్య కేశేషు జీమూతాః మద్యః సర్వాంగసంధిషు ।**
**కుక్షౌ సముద్రాశ్చత్వారః తస్మై తోయాత్మనే నమః ॥ 61**

అతని శిరసున మేఘాలూ, అన్ని అంగసంధులలో నదులు ఉన్నాయి. కడుపులో నాలుగు సముద్రాలు ఉన్నాయి. అట్టి తోయాత్మకునకు నమస్కారం.(61)

**యస్మాత్సర్వాః ప్రసూయంతే సర్గప్రలయవిక్రియాః ।**
**యస్మింశ్చైవ ప్రలీయంతే తస్మై హేత్వాత్మనే నమః ॥ 62**

సృష్టి, ప్రళయ రూపమయిన వికారాలు అన్నీ అతని నుండియే పుడుతున్నాయి. అతనిలోనే లీనమై పోతున్నాయి. అటువంటి కారణరూపునకు నమస్కారం. (62)

**యో నిషణ్ణో భవేద్రాత్రౌ దివా భవతి విష్ఠితః ।**
**ఇష్టానిష్టస్య చ ద్రష్టా తస్మై ద్రష్టాత్మనే నమః ॥ 63**

అతడు రాత్రిపూట మేల్కొని ఉంటాడు. పగటిపూట సాక్షీభూతుడై నిలిచి ఉంటాడు. ఎల్లపుడూ ఇష్టానిష్టాలను చూస్తూ ఉంటాడు. అటువంటి ద్రష్టరూపునకు నమస్సులు.(63)

**అకుంఠం సర్వకార్యేషు ధర్మకార్యార్థముద్యతమ్ ।**
**వైకుంఠస్య చ తద్రూపం తస్మై కార్యాత్మనే నమః ॥ 64**

సర్వ కార్యాలలోనూ అడ్డులేకుండా, ధర్మకార్యాలకోసం ప్రయత్నిస్తూ వైకుంఠరూపంకల కార్యాత్మునకు నమస్సులు. (64)

**త్రిఃసప్తకృత్వో యః క్షత్రం ధర్మవ్యుత్క్రాంతగౌరవమ్ ।**
**క్రుద్ధో నిజఘ్నే సమరే తస్మై క్రౌర్యాత్మనే నమః ॥ 65**

ధర్మ గౌరవం తొలగిన క్షత్రియ సముదాయాన్ని ఇరవై ఒక్క మారులు క్రోధంతో యుద్ధంలో చంపిన వాడు పరశురాముడు. అట్టి క్రౌర్యాత్మునకు నమస్కారం. (65)

**విభజ్య పంచధా22త్మానం వాయుర్భూత్వా శరీరగః ।**
**యశ్చేష్టయతి భూతాని తస్మై వాయ్వాత్మనే నమః ॥ 66**

తనను అయిదు భాగాలుగా విభజించుకొని వాయువుగా అయి, శరీరంలో ఉండి సర్వప్రాణులనూ కదిలించే వాయురూపునకు నమస్కారం. (66)

**యుగేష్వావర్తతే యోగైః మాసర్త్వయనహాయనైః ।**
**సర్వప్రలయయోః కర్తా తస్మై కాలాత్మనే నమః ॥ 67**

మాసాలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలు అనే విభాగాలతో ఆయా యుగాల్లో యోగబలంతో మళ్లీ మళ్లీ వస్తూ, సృష్టికీ ప్రళయానికీ కూడా తానే కర్త అయిన కాలాత్మునకు నమస్కారం. (67)

**బ్రహ్మ వక్త్రం భుజౌ క్షత్రం కృత్స్నమూరూదరం విశః ।**
**పాదౌ యస్యాశ్రితాః శూద్రాః తస్మై వర్ణాత్మనే నమః ॥ 68**

ఆయన ముఖాన్ని బ్రాహ్మణులు, భుజాలను క్షత్రియులు, పొట్ట, తొడలను వైశ్యులు, పాదాలను శూద్రులు ఆశ్రయించి ఉన్నారు. అట్టి వర్ణాత్మకునకు నమస్కారం.(68)

**యస్యాగ్నిరాస్యం ద్యౌర్మూర్ధా ఖం నాభిశ్చరణౌ క్షితిః ।**
**సూర్యశ్చక్షుర్దిశః శ్రోత్రే తస్మై లోకాత్మనే నమః ॥ 69**

అతని ముఖమే అగ్ని, తల స్వర్గం, బొడ్డు ఆకాశం. పాదాలు భూమి. కన్ను సూర్యుడు. దిక్కులు చెవులు. అటువంటి లోక స్వరూపునకు నమస్కారం. (69)

**పరః కాలాత్పరో యజ్ఞాత్ పరాత్పరతరశ్చ యః ।**
**అనాదిరాదిర్విశ్వస్య తస్మై విశ్వాత్మనే నమః ॥ 70**

అతడు కాలం కంటె పరుడు. యజ్ఞంకంటె పరుడు. పరంకంటె పరమయిన వాడు. అతనికి ఆదిలేదు. కాని విశ్వానికి అతడే ఆది. అటువంటి విశ్వాత్మునకు నమస్కారం. (70)

**(వైద్యుతో జాఠరశ్చైవ పావకః శుచిరేవ చ ।**
**దహనః సర్వభక్షాణాం తస్మై వహ్న్యాత్మనే నమః) ॥**

అతడు మేఘంలో విద్యుత్తుగాను, ఉదరంలో జఠరాగ్నిగాను ఉన్నాడు. అందరినీ పవిత్రం చేస్తూ పావకుడు అనీ, శుద్ధిచేస్తూ శుచి అనీ పిలువబడుతున్నాడు. సర్వ పదార్థాలను దగ్ధం చేసేది అతడే. అటువంటి వహ్ని రూపునకు నమస్సులు.

**విషయే వర్తమానానాం యం తే వైశేషికైర్గుణైః ।**
**ప్రాహుర్విషయగోప్తారం తస్మై గోప్త్రాత్మనే నమః ॥ 71**

అతడు విషయాల్లో ప్రవర్తించే వారిని అనాదరించి, విశేషగుణాలచేత విషయాన్ని రక్షిస్తాడని చెపుతారు. ఆ రక్షక రూపునకు నమస్కారం. (71)

**అన్నపానేంధనమయః రసప్రాణవివర్ధనః ।**
**యో ధారయతి భూతాని తస్మై ప్రాణాత్మనే నమః ॥ 72**

అతడు అన్నం, నీరు అనే వాటిని ఇంధనాలుగా చేసుకొని, రసాన్ని ప్రాణాన్ని వృద్ధిపొందిస్తూ సర్వభూతాలనూ ధరిస్తాడు. అటువంటి ప్రాణరూపునకు నమస్కారం.(72)

(సశేషం)

# సింహగర్జన

**మూలము : స్వామి ఓంకార్** **స్వేచ్ఛానువాదము : గరిగిపాటి కృష్ణ**

## సమస్యలను ధైర్యంగా అధిగమించాలి

వేదాంతవిద్యనభ్యసించి, దానిలో ఆరితేరినవాళ్లుకూడా సింహము వలె గర్జించకుండా మేకపిల్ల వలె అరుస్తారంటే అది చాలా విచారకరమైన విషయంగా భావించాలి. మనిషి తన వాక్పటిమతో భగవంతుని సర్వాంతర్యామిత్వాన్ని వేనోళ్లకీర్తిస్తాడేగాని తన చుట్టుప్రక్కల గాని, తన లోపలగాని భగవంతుని ఉనికిని గుర్తించలేకున్నాడు. అలాగే భగవంతుని సర్వశక్తిమత్వాన్ని ఇతరులకి బోధించడములో ఆనందాన్ని పొందుతున్నాడేతప్ప, తనకుతానుగా ఒక బలహీనుడిగా రుగ్మతలకులోనై, శక్తిహీనుడిగా జీవితాన్ని వెళ్ళదీస్తాడు. అదేవిధముగా ఆతడు భగవంతుని సర్వజ్ఞునిగా అభివర్ణిస్తూనే, తనకుతాను అజ్ఞానపు అంధకారములో కూరుకుని పోయి ఉంటాడు.

నేటి సమాజములో, మనము గర్జించే సింహములను చాలా అరుదుగా చూస్తాము కాని మేకపోతు గాంభీర్యమును ప్రదర్శించేవాళ్లు మనచుట్టూనిండి ఉండడము మనకు అనుభవములోకి వస్తుంది. ఈ నిస్సహాయస్థితికి కారణము, తనకు తాను అద్వితీయమైన ఆత్మస్వరూపమని తెలిసికొనక, తాను ఈ దేహము అనే భ్రాంతిలో ఉండడమేకాని మరొకటి కాదు. సహజముగా తాను ఈ నశ్వరమైన దేహమనే అపోహ కలిగి ఉన్నంత కాలము, ప్రతి చిన్న శబ్దమూ, మార్పూకూడా మనిషిని భయభ్రాతులకు గురిచేస్తాయి. ఎవరైతే మార్పులేని, నాశములేని, కోటిసూర్యప్రభలకాంతితో విరాజిల్లే ఆత్మతో తాదాత్మ్యము చెందుతారో, అట్టివారు సింహము వలె గర్జిస్తారు తప్ప మేకవలె భయమును, శోకమును పొందరు.

ధృఢత్వము మనిషికి సహజముగా సంక్రమించే హక్కుకాని, దుర్బలత్వము ఎన్నటికీ కాదు. అందుచేత మనిషి సహజ లక్షణము నిర్భయత్వమేకాని భయంతో కంపించడముకాదు. ఎన్ని గడ్డు పరిస్థితులు, అవాంతరములు కలిగినా మనిషి క్రుంగిపోకుండా ఆ సమస్యలను ధైర్యముగా ఎదుర్కొని, అధిగమించాలి. ఈ విధంగా తాను సత్యశీలతతో జీవించినట్లైతే ఆతడు మరణము ఆసన్నమైనా సింహమువలె గర్జిస్తాడుతప్ప మేకవలె మేమే అనడు.

నక్కలు కూసినా, కుక్కలు మొరిగినా, కప్పలు బెకబెక మనినా, అవి సింహము యొక్క పౌరుషానికి, ధీశక్తికీ ఏ మాత్రమూ సాటిరావు. మీరెప్పుడైనా ఏనుగు పురవీధులవెంట వెళుతూ ఉంటే వందలకొలదీ ఊరకుక్కలు మొరగడము గమనించారా? అది తన సహజ గాంభీర్యముతో, చలించక వెళుతుందే తప్ప వీధివెంబడి జరిగే చిన్న, చిన్న అవాంతరాలనీ, అరుపులనీ ఏ మాత్రమూ పట్టించుకోక రాజసము ఉట్టిపడేలా నడుస్తూ వెళుతుంది. అదే విధముగా వ్యక్తి తన జీవితాన్ని ఏనుగులా శక్తివంతముగా మలచుకోవాలి. మనిషి తనను తాను సింహాలు, ఏనుగులతో పోల్చుకోవాలేతప్ప మేకలతోటి, గొర్రెలతోటి కాదు.

మనిషి సాధన ద్వారా తాను ఆత్మ కంటే వేరు కాదనే సత్యమును గుర్తెరిగి సింహమువలె గర్జించాలితప్ప రక్త, మాంసములతో నిండియున్న దేహమనే భ్రాంతిలో తాను అశక్తుడు, దుర్బలుడు అని భావించరాదు. ***మనము ఇప్పుడు ధ్యానము చేద్దాము***

'మనము శ్వాస మీద ధ్యాస నిలిపితే, మనలోని సింహము గర్జిస్తుంది. మనము ప్రకాశము వంటి సింహము వలె ఉంటాముకాని మేకవలె అంధకారములోకాదు. మనము నిర్భయముగా సింహము వలె ఆనందముతో నిరంతరమూ గర్జిద్దాము కాని ఏనాడూ భయముతో మేకవలె మే మే అనవద్దు. సింహము వలె గర్జించే మహాత్ములకు జయము జయము

**సర్వేజనాః శాంతిర్భవతు**

**ఓమ్ ఓమ్ ఓమ్**

# తత్త్వమసి

శ్రీ తెన్నేటి విశ్వనాథం

(క్రిందటి సంచిక తరువాయి)

## రంగము - 3

స్థలము : ఉద్దాలకుని ప్రాంగణము. ఒక మర్రిచెట్టు క్రింద పేర్చిన ఇటుకలదిమ్మ. దూరముగ నుయ్యి అరటి చెట్లు, నిమ్మచెట్లు గుబురుగ పెరిగియుండును. మరియొక ప్రక్కగ వెనుకకు కుటీరము ప్రక్క పెద్ద పాకలవైపు ఆవులు దూడలు తిరుగాడుచుండును. (ఉద్దాలకుడు - శ్వేత కేతువు - ఋషికుమారులు - ఒక వయసుముదిరిన ముని కమండలము పట్టుకొని ప్రవేశము)

ఉ ॥ నాయనా శ్వేత కేతూ!

శ్వే ॥ నాయన గారూ, మీరు చెప్పినట్లే పదునైదు దినములు అశనుడనై ఉంటిని. మీయాజ్ఞ ననుసరించి ఉదకముమాత్రము సేవించుచుంటిని.

ఉ ॥ ఎట్లున్నది ఒడలియందు?

శ్వే ॥ కొంచెము నీరసముగ ఉన్నది. అయినను సంధ్యా వందనాధ్యయనములకు ఎట్టిలోపము రానీయ లేదు.

ఋ ॥ అవును మహర్షీ, మేము దినదినము ఇతనిని చూచుచునే ఉన్నాము. అతిదీక్షాపరుడు అతిపవిత్రుడు మిత్రుడు శ్వేతకేతువు.

ముని ॥ ఉద్దాలకా, బుగ్గల లేతదనముబోవని ఈచిన్నవాని కెంత కఠోరమైన ఆజ్ఞ విధించినావు. ఇది విని నిన్నడుగుదామనే రాత్రివచ్చితిని.

ఉ ॥ ఆశ్రమమందు ఫలహార నిద్రాదులు సరిగ జరిగినవా!

ము ॥ సరిసరి, అడుగవలెనా? నీ యాతిథ్య సౌరభము భారతదేశ వ్యాప్తముగద.

ఉ ॥ భవదనుగ్రహము, మరి శ్వేత కేతువు విషయము అడిగితిరిగదా, జిజ్ఞాసువులు కఠినదీక్ష పూనినగాని తమలోగల వివేచనాశక్తి యొక్క ప్రయోజనము పొందజాలరు.

ము ॥ అవును.

ఉ ॥ కుమార, ఋగ్యజుస్సామములలో దేనినైన ప్రవచనము చేయుము.

శ్వే ॥ (కొంతతడవు ఆలోచించి) నాయనగారు స్ఫురణకు రాకున్నవి.

ఉ ॥ మనుష్యునకు అన్నముచేతనే మనస్సు వృద్ధిపొందునని చెప్పితినిగదా! చూడు ఆ నిప్పులలో ఒక కణము మిణుగురు మాత్రమున్నది. దానిపై బరువైన కట్టెలమోపు పెట్టుము. (శ్వేతకేతువు అట్లుచేయును).

ఉ ॥ ఆకట్టెలమోపును తీసివేయుము (శ్వేతకేతువట్లు చేయును)

ఉ ॥ ఆ కట్టెలు నిప్పు అంటుకొన్నవా?

శ్వే ॥ లేదు.

ఉ ॥ ఆ మిణుగురువలెనుండిన నిప్పు ఏమైనది?

శ్వే ॥ అదియు ఆరిపోయినది.

ఉ ॥ నాయనా, అన్నరస సూక్ష్మాంశమువలన వృద్ధి పొందు నీమనసు పదునైదు రోజులు అన్నము లేకుండుటవలన ఆమిణుగురువలె నున్నది. తిరిగి పదునైదు రోజులు విధివత్ భోజనము అయిన పిమ్మట నాకు కనిపించుము. అపుడు చూతుము. (అందరు లేచి మహర్షికి నమస్కరింతురు.

**తెరదిగును**

(ఉద్దాలకుని ఉద్యానవనము. దూరముగ కుటీరము చెట్టుకొమ్మలనుండి వ్రేలాడు వస్త్రములు ఉండును. ఒక ప్రక్కనుండి సామవేదము చదువుచూ ముగ్గురు నలుగురుశిష్యులు ప్రవేశింతురు. వారువచ్చి కూర్చొను లోపున మరియొక్క వైపునుండి కాషాయాంబరధారులగు ఇద్దరు ముగ్గురు సన్యాసులువచ్చి ప్రక్కను తమ కమండలములుపెట్టి తమ దండములపై ఆనుకొని కూర్చొనునంతలో ఉద్దాలక మహర్షి వెనుకనొక శిష్యుడు ఒక పాత్రను, గ్రంధమును పట్టుకొన్ని వానితో పాటు ప్రవేశము. అందరు లేచి ఆయనకు నమస్కరింతురు.)

ఉ ॥ నాయనలారా, అశీర్వాదములు, సన్యాసులకు స్వాగతము ఏడీ శ్వేత కేతువు? (అంతట శ్వేత కేతువు ప్రవేశించి అందరికి, పెద్దలకు ప్రత్యేకముగ నమస్కరించి చేతులు జోడించి తండ్రియెదుట నిల్చుండును.)

స ॥ స్వామీ ఉద్దాలకా, నీ కుమారుని శ్వేత కేతువు ముఖములో ఏదియోయొక క్రొత్తకాంతి పొడకట్టుచున్నది.

ఉ ॥ అది మీఅశీర్వాదఫలము... నాయనా శ్వేత కేతూ, నేను చెప్పిన ప్రకారము విధిపూర్వకముగ పదునైదు దినములును భోజనముచేసి అధ్యయనాదులను జరిపితివా?

శ్వే ॥ చిత్తము, నాయనగారూ, అలాగునే చేసితిని.

ఉ ॥ ఋక్కులు, స్ఫురణకు వచ్చుచున్నవా?

శ్వే ॥ వచ్చుచున్నవి.

ఉ ॥ చత్వారి వాక్పరిమితాని తాని
విదుః బ్రాహ్మణాః యేమనీషిణః
ఆ రహస్యార్ధము స్ఫురణకు వచ్చుచున్నదా మన
నము చేయ గలుగుచుంటివ!

శ్వే ॥ చిత్తము చక్కగ మననముచేయగలుగుచున్నాను.

ఉ॥ ఉదకభక్షణము చేయుచు అనశుడవైయున్నప్పుడు నీ మననశక్తి తగ్గినది.

శ్వే ॥ అవును.

ఉ ॥ అందుచేతనే, మనస్సు అన్నవికారము. ప్రాణము ఉదకవికారము అని చెప్పియుంటిని.

శ్వే ॥ చిత్తము భగవాన్, అర్థమయినది, అర్థమయినది.

ఉ ॥ నీ ఒడలియందు ఎట్లున్నది?

శ్వే ॥ సంపూర్ణమైన ఆనందబలములతో నిండియున్నది.

ఉ ॥ నీకు సౌఖ్యముగ నిద్రపట్టినదా ఈ రాత్రి?

శ్వే ॥ చిత్తము.

ఉ ॥ నిద్రపోయినపుడు నీవు ఎక్కడనుంటివి?

శ్వే ॥ ఎక్కడ నుంటిని? నాయందే యుంటిని.

ఉ ॥ అప్పుడు లోకముతో సంబంధము ఉండెనా?

శ్వే ॥ నాకి సంబంధము కనిపించలేదు.

ఉ ॥ పోనిమ్ము. నీ ఇంద్రియములతో నీకు సంబంధముండెనా?

శ్వే ॥ అదికూడ తెలియలేదు.

ఉ ॥ ఆ నిద్ర నీ కానందమును ఇచ్చినదా?

శ్వే ॥ ఓ, నిరతిశయమైన ఒక ఆనందమును ఇచ్చినది.

ఉ ॥ వర్ణించుము.

శ్వే ॥ మాటలు చాలవు.

ఉ ॥ నీలోనికి నీవు వెళ్లితివి. స్వయమైనదానిలోనికి వెళ్లి వుండుట అనేదానిని అనుభవించితివి. అదియే నీకు నిరతిశయమైన ఆనందమును ఇచ్చినది. ఆ స్వయ మైనదన్నది, "నేను" అని నీవిప్పుడనుచున్నది. జాగ్రదవస్థలోవేరు; సుషుప్తిలో ఏకము-అంతేనా-నామరూపక్రియాది వాగ్వ్యాపారముగ కనపడుచున్నది. దానికి మూలమైవది ఒకటే. ఆ ఒకటిగా ఉన్నదే నీవు. అంతేనా?

శ్వే ॥ తర్కించినట్లయిన ఆలాగుననే తోచుచున్నది.

ఉ ॥ తెలియక అట్టి ఆనందావస్థలో దేనితోనీవు ఏకమై ఆనందమొందితివో అది నిద్రావస్థ. తెలిసి అట్టి దానితో నీవు ఏకమై ఆనంద మొందగలిగినపుడు అది పరిపూర్ణమైన జ్ఞానప్రాప్తి. ఆ ఆనందము అఖండము. ఆ ఆనందము అద్వితీయము. ఆ ఆనందము సత్యమైనది. దానిని చెప్పుటకు మాటలకు శక్తిచాలదు. కేవలము అనుభవైక వేద్యము. అది పెద్దలైన మహర్షుల సొమ్ము.

ముని ॥ స్వామి, ఉద్దాలకా 'పెద్దలు' అని అనుచున్నారు. మీకన్నను పెద్దలు ఎవరు?

ఉ ॥ దేహేంద్రియ సంఘాతమందున్నట్లు అనిపించుచు, జగమునందు చరించుచున్నట్లు కనిపించుచు, మాటలాడుచున్నట్లు మనకు వినబడుచు, ఎవరు సత్యమై, జ్ఞానమై ఆనందమై సకలజగదాత్మకమై యుందురో వారు పెద్దలు, అట్టివారికి నామమోవాకములు. (నమస్తేభ్యః)

**(తెరదిగును)**

## రంగము - శ్రీశ్రీ

### ఉద్దాలకుని ఆశ్రమప్రాంతము

పటవృక్షము ప్రక్కగ ఒకకుటీరము, నలుగురయిదుగురు సన్న్యాసులు, అయిదారుగురు శిష్యులు శ్రద్ధామయులై కుటీరద్వారమువైపు చూచుచుండగ

### ఉద్దాలకుని ప్రవేశము

ఒక మునికుమారుడు లేచి వారి చేతులనుండి కమండలము మరియొకడు దండము పుచ్చుకొందురు. మరి యొకడు లేడిచర్మము పరువగ ఉద్దాలకుడు పద్మాసనమున కూర్చుండును. అందరును యథాశాస్త్రముగ అభివాదన మాచరింతురు.

ఉ ॥ జ్ఞానవిజ్ఞాన ప్రాప్తిరస్తు మీకు, కూర్చొనుడు.

ము ॥ స్వామీ జీవవిశిష్టమయిన ఈశరీరమునకుమూలము?

శ్వే ॥ నాయనగారూ పంచభూతము లేగదా!

ము ॥ పంచభూతములు ఒకటికొకటి మూలమా? లేక అన్నియుకలిసి మూలమా? (శ్వేత కేతువు ఆలోచించుచుండును).

ఉ ॥ చెప్పెదను క్లుప్తముగ వినుడు.
శరీరమునకు అన్నము మూలము.
అన్నమునకు ఉదకములు మూలము.
ఉదకములకు తేజస్సు మూలము.
తేజస్సునకు సత్ పదార్థము మూలము.
ఈ సత్స్వరూపము సూక్ష్మమైనది
ఈ సూక్ష్మమైన సత్స్వరూపమే పారమార్థికమైన సత్యము.

ఆ సత్యమైనదే ఆత్మయైయున్నది.
ఆ అత్మయేనీవు, తత్త్వమసి.
గ్రహించితివా?

శ్వే ॥ భగవన్.

ఇతరులు : చిత్తము భగవన్, మరియొకసారి చెప్పుడు.

శ్వే ॥ లోగడ సుషుప్తియందు బ్రహ్మప్రాప్తి కలుగునని చెప్పితిరి. అట్లయినచో సుషుప్తి అనంతరము ఆ ఆత్మయే నేనైన ఎడల ఎందుచేత నాకు అట్టి అభిజ్ఞ కలుగదు. ఆ ఆత్మ నేను అన్నది. మరొకమారు బోధపరుపవలయును.

ఉ ॥ మధుమక్షికములు మధువును ఒక వృక్షమునగల పుష్పములనుండి సమకూర్చునా?

శ్వే ॥ నానావిధ వృక్షములందు పుష్పించిన పుష్పముల రసములను గ్రహించును.

ఉ ॥ వేరు వేరుగ ఆ మధువులను ఉంచునా?

శ్వే ॥ లేదు భగవన్, అన్ని మధువులను సమాహారము చేసి ఏకత్వమును కలుగ జేయును.

ఉ ॥ ఆ సమయమున ఏపుష్ప మధుబిందువై నను నేను ఫలానా పుష్పమునుండి కలిగితినని చెప్పుటకు వీలగునా?

శ్వే ॥ లేదు. అందుచేతనే కాబోలు. సుష్పప్త్యవస్థయందు అందరు బహ్మప్రాప్తి పొందినపుడు– నేను – నేను అను ప్రత్యేకభావము పొందరు.

ఉ ॥ అది అట్లేఅగును. ఆ సమయమందు ప్రత్యేక వృత్తులు విరమించి యుండును. అద్వితీయమై, అఖండమై ఏక రసమైన బ్రహ్మమాత్రమై యుండును.

శ్వే ॥ అట్లయినచో భగవన్, నిద్రానంతరము ఏల అది తెలియకున్నది?

ఉ ॥ జాగ్రత్తగ వినుడు.
వాక్ప్రాణమనస్సులు వృత్తిశూన్యములయిన సమయమందు కలిగిన బ్రహ్మప్రాప్తిని నిద్రానంతరము ఎట్లు తెలిసికొనగలరు!

ము ॥ మరి?

ఉ ॥ అందుచేతనే వాక్ప్రాణమనస్సులు యోగసమాధి యందు ఆబ్రహ్మప్రాప్తి కలిగినయెడల నీవన్నట్లు నిద్రానంతరము కూడ ఆ అనుభూతి నీకు తెలియగలదు. అందులకే యోగ సాధనలను మీకు ముందుగ గురువులు నేర్పుట. అట్లు దేనియందు నీవు ఏకమై ఉందువో అదియే ఈ సర్వవృత్తులకు అధిష్ఠానము. అదియే సూక్ష్మమైనది. అదియే సత్యము. అదియే ఆత్మ.
ఆ ఆత్మయేనీవు, తత్త్వమసి.

ముని ॥ స్వామీ, ఇది సుష్ప్తి, అనంతరము జరుగు విషయము. మరణము సంభవించి దేహాంతరప్రాప్తి పొందినపుడు తాము చెప్పినది ఎట్లు పొసగును?

ఒక శిష్యుడు ॥ పూర్వదేహస్మృతి ఉండినకదా అట్లు సంభవమగుట కుదురును.

ఉ ॥ వినుడు. గంగానది మొదలగునవి తూర్పు వాహినులు. సింధునది మొదలయినవి పశ్చిమవాహినులు అవియు ఇవియుకూడా సముద్రమునుండి ఆదిత్యుడు గ్రహించిన నీరు మేఘరూపము దాల్చి వర్షించిన పర్వతములనుండి తిరిగి సముద్రములోనికి పోవుచున్న జలప్రవాహములేగద! పర్వతప్రాంత వర్ష పూర్వమునగాని, సముద్ర సంగమానందరముగాని అందులో ఏది గంగ, ఏది యమున, ఏది సింధువు? నదులు లేకున్నను సముద్రము మిగిలియున్నది. అట్లే పూర్వదేహస్మృతి లేకపోయినను సన్మాత్ర శేషముగ ఉన్నది. అవునుగద.

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి

## తులసి లేని పూజ వ్యర్థము

### సి. తులసిని సదా భగవంతునికర్పింపవలెను

శ్లో ॥ **తులసీ న యేషాం హరిపూజనార్థం ।**
**సంపద్యతే మాధవపుణ్యవాసరే ॥**
**ధిగ్ యౌవనం జీవనం యచ్చ సంతతి ।**
**స్తేషాం సుఖం నేహ చ దృశ్యతే పరే॥** (పద్మపురాణం)

తా॥ వైశాఖ మాసములోని, పుణ్యదినములైన ఏకాదశి, అక్షతదియ మొదలగు పవిత్రదినములయందు తులసితో శ్రీహరిని ఎవరు పూజింపరో వారి జీవితము నిందింపదగినది. వారి యౌవనము, సంతతి కూడ వ్యర్థము అట్టివారికి ఇహపరలోకముల యందు కూడ సుఖముండదని పద్మపురాణము వెల్లడించినది.

### డి. తులసితో సమర్పింపని పూజను శ్రీహరి స్వీకరింపడు

శ్రీ భగవానువాచ:

శ్లో ॥ **తులసీం ప్రాప్య యో, నిత్యం న కరోతి సమర్చనమ్ ।**
**తస్యా హం ప్రతిగృహ్ణామి న పూజాం శతవార్షికీమ్ ॥** (గరుడపురాణము)

తా॥ శ్రీమహావిష్ణువు తనకు తులసి ఎంత ఇష్టమైనదో గరుడునకు శ్లోకమునందు వివరించుచున్నారు. ఓ గరుడుడా! ఏ మానవుడు నిత్యము తనకు తులసి అందుబాటులో వున్నను, దానితో నన్ను అర్చింపడో, వాడు వందసంవత్సరములనుండి పూజచేయుచున్నను దానిని స్వీకరింపను.

శ్లో ॥ **తులసీరహితాం పూజాం న గృహ్ణాతి సదా హరిః ।**
**కాష్ఠం వా స్పర్శయే త్తత్ర నోచే న్నామభి ర్యజేత్ ।**
(వాయుపురాణము)

తా ॥ తులసిని ఉపయోగించకుండ చేసిన పూజను హరి ఎన్నడును స్వికరింపడు. అభిషేకమునకును, పూజకును, తులసీదళం దొరకనిచో తులసి కాడనైనను ఆయా దేవతలకు తాకింపవలెను. లేదా నామములతోనైనను పూజింపవలెను.

#### ఇ. తులసీపత్రపూజ

శ్లో ॥ **త్వదంగ సంభవైః పత్రైః పూజయామి యథా హరిమ్ ।**
**తథా కురు పవిత్రాంగి! కలౌ మలవినాశిని ॥**

తా ॥ కలికాలమునందలి పాపములను నశింపచేయుదానా! పవిత్రములైన అంగములు కలదానా! ఓ తులసీ ! నేను నీనుండి పుట్టిన ధళములతో శ్రీహరిని పూజించునట్టి అవకాశమును నాకు కలిగింపుము.

## ఎఫ్. క్షమాపణమంత్రము

శ్లో ॥ **చయనోద్భవ దుఃఖం తే య ద్దేవి! హృది వర్తతే!**

**తత్ క్షమస్వ జగన్మాత స్తులసి ! త్వాం నమా మ్యహమ్ ॥**

ఓ జగన్మాతా! తులసీ। నీ దళములను కోయుటవలన కలిగిన దుఃఖము, హృదయమునందు నిలిచి యున్నచో, నేను చేసిన, నా అపరాధమును క్షమింపుము. ఇదుగో నా నమస్కారములను అందించుచున్నాను.

శ్లో ॥ **మోక్షైకహేతో ధరణీప్రశస్తే విష్ణోః సమస్తస్య గురోః ప్రియేతి**

**ఆరాధనార్థం వరమంజరీకం లునామి పత్రం తులసి! క్షమస్వ ॥**

తా ॥ మోక్షమును ప్రసాదించుటకు ఏకైక హేతువు అయినదానా! భూమండలములో ప్రశస్తమైనదానా! విష్ణువుయొక్క సర్వదేవతలయొక్క గురువుల యొక్క పూజకొరకు నీవు వారందరికి సదా ఇష్టమైనదానవు అనుబుద్ధితో శ్రేష్ఠమైన మంజరులతో (వెన్నులతో) కూడిన నీ దళములను తులసీ కోయుచున్నాను. ఓ తులసీ! నేను చేయుచున్న ఈ అపరాధమును మన్నింపుము.

శ్లో ॥ **మాత స్తులసి! గోవిందహృదయానందకారిణి ।**

**దామోదరస్య పూజార్థం చినోమి త్వాం నమో2స్తు తే ॥**

అమ్మా! తులసీదేవీ! గోవిందునికి హృదయానందమును కలిగించుదానా! దామోదరునియొక్క పూజకొరకు నీ దళములను కోయుచున్నాను. నీకు ఇవే నా నమస్కారములు.

శ్లో ॥ **కుసుమైః పారిజాతాద్యై రపి కేశవః ।**

**త్వయా వినా నైవ తృప్త శ్చినోమి ॥**

తా ॥ ఓ శుభప్రదురాలా! కేశవుడు తనను పారిజాతము మొదలగు పుష్పములతోను గంధధూపాది వస్తువులతోను ఎంతగా పూజింపబడినను ఆ పూజా ద్రవ్యములలో నీవు లేనిచో నాతడు తృప్తిపడడు. ఈ విషయమును తెలిసికొని, అతనికి తృప్తిని కలిగించుటకు మాత్రమే నేను ఈ దళమును కోయుచున్నాను.

శ్లో ॥ **త్వయా వినా మహాభాగే! సమస్తం కర్మ నిష్ఫలమ్**

**అత స్తులసి! దేవి ! త్వాం చినోమి వరదా భవ ॥**

తా ॥ ఓ తులసీదేవీ! మహాభాగా! నీవు లేనిచో సమస్తకర్మలు నిష్ఫలములైపోవును. కర్మలు నిష్ఫలము కాకుండా సఫలము కావలెను అను దృష్టితోనే నేను నీ దళములు ప్రోగుచుయుచున్నాను. నీవు నా కోర్కెను నెరవేర్పుము.

**జి. తులసీపత్రభక్షణఫలము**

శ్లో ॥ **సితాసితం యథా నీరం సర్వపాపక్షయావహమ్ ।**
**తదా చ తులసీపత్రం ప్రాశితం సర్వకామదమ్ ॥**

తా ॥ తెల్లని గంగాజలమును, నల్లని యమునాజలమును, వానిలో స్నానము చేసిన వారియొక్క సర్వపాపములను హరించును. అట్లే తెల్లని, నల్లని దళమును తినినవారికి సర్వపాపములు నశించి అన్ని కోర్కెలు తీరును.

శ్లో ॥ **యథాజాతబలో వహ్నిః దహతే కాననాదికమ్ ।**
**ప్రాసితం తులసీపత్రం తథా దహతి పాతకమ్ ॥**

తా ॥ బాగుగా ప్రజ్వలించుచున్న అగ్ని, అరణ్యము మొదలగువానిని పూర్తిగా దహించివేయునట్లు తులసీదళమును భక్షించిన వారియొక్క పాపసమూహ మంతయు దహింపబడును.

శ్లో ॥ **యథా భక్తిరతో నిత్యం సరో దహతి పాతకమ్ ।**
**తులసీభక్షణా త్తద్వవత్ దహతే పాపసంచయమ్ ॥**

తా ॥ భక్తుని భక్తి, వారి పాపములను అన్నింటిని ఎట్లు దహించునో అట్లే, భక్షించిన తులసిదళము, తిన్నవారియొక్క పాపములను దహించివేయును.

శ్లో ॥ **చాంద్రాయణసహస్రస్య పరాకానాం శతస్య చ ।**
**న తుల్యం జాయతే పుణ్యం తులసీపత్రభక్షణాత్ ॥**

తా ॥ వేయి చాంద్రాయణవ్రతములు చేసినవానికి వచ్చు పుణ్యమును, అట్లే 100 పరాకవ్రతములను చేసిన వానికి వచ్చు పుణ్యమును, ఒక్క తులసీ దళమును తినినవానికి కలుగు పుణ్యముతో సరిసమానము కానేకాదు.

శ్లో ॥ **అమృతా దుదితా ధాత్రీ, తులసీ విష్ణువల్లభా ।**
**స్మృతా సంకీర్తితా ధ్యాతా ప్రాశితా, సర్వకామదా ॥**

తా ॥ శ్రీ విష్ణువునకు ఇష్టురాలైన తులసియును, ఉసిరియును అమృతమునుండి ఆవిర్భవించినవి. అందువలన ఆ పుణ్యవృక్షములను స్మరించినను, సంకీర్తనము చేసినను, ధ్యానించినను తినినను అట్టివారికి ఆ వృక్షములు సర్వమనోరథములను పూర్తిచేసి ఆనందమును కలిగించును.

# మాతాజీ అపూర్వం

మాతాజీ
        కళ్ళల్లో మెరుపులు కన్పిస్తాయి
అటువంటి మనసు కావాలి మనకు
        ఎందుకంటే మనల్ని జీవితమనే
అక్షరాలలో కూర్యోబెట్టి
        ఊపిరిని సుఖంగా
వదిలేట్టు తీర్చుతారు
        మాతాజీ
సూర్య రాగం పలకక ముందే
        పొడుచుకు వచ్చే
వేగుచుక్కలా ఉంటుంది.
        మాతాజీ మాటల్లో మాధుర్యం
మాధుర్యాన్ని మనకు మనం
        అనుభవించాలని అనుకుంటే
చాలా తేలికైన సుఖం
        ఇతరులకు పంచాలనుకుంటే కష్టం
ఆ కష్టమే స్వీకరిస్తారు
        మాతాజీ మన అందరి కోసం
అందులోనే ఉంటుంది
        మధురమైన మధురం
అందమైన శిల్పాన్ని నిలబెట్టడంలో
        అంతులేని సంతృప్తి.
ఏమీ సాధించలేని
        అశక్తుడుగా మిగిలిపోయిన మనసుకు
రూపం ఇవ్వడం అపూర్వం.
        ఆ అపూర్వమే
మాతాజీ.

**మలిశెట్టి శ్రీనువాస రంగారావు (బన్ను)**

# పరిత్రాణములు

**బోధ చైతన్య**

ఒకప్పుడు లిచ్ఛవి గణతంత్ర రాజ్యంలో కరువు సంభవించింది. ఆకలి చావులు ఎక్కువైనాయి. దిక్కు లేని శవాలు కుళ్ళిపోవడంతో అంటు వ్యాధులు ప్రబలినాయి. లిచ్ఛవి పరిపాలకులకు దిక్కు తోచలేదు. బుద్ధుడు దేశంలో అడుగుపెడ్తే అంతా చక్కబడుతుందని భావించారు. అప్పుడు బుద్ధుడు మగధరాజధాని రాజగృహ సమీపంలోని వేణువనంలో ఉన్నాడు. లిచ్ఛవిరాజ్య ప్రతినిధిగా ఒక రాజకుమారుడు తన పురోహితుణ్ణి వెంటబెట్టుకొని కొన్ని దినాల ప్రయాణం తరువాత వేణువనం చేరుకొని బుద్ధుణ్ణి ప్రార్థించాడు. బుద్ధుడు ప్రయాణానికి సమ్మతి తెలిపాడు. తథాగతుని ప్రయాణ వార్త బింబిసారునికి తెలిసింది. బుద్ధుని ప్రయాణం సుఖంగా జరుగాలని భావించి బింబిసారుడు రాజగృహం నుండి గంగానది ఒడ్డున ఉన్న పాటలి గ్రామం వరకు వేళ్లే రహదారిని బాగు చేయించి యోజనానికి ఒక విశ్రామశాల నిర్మించాడు.

గంగానది ఆవలివైపు నుండి వైశాలి వరకు లిచ్ఛవిరాజులు రహదారిని సుందరంగా తీర్చి అక్కడక్కడా విశ్రామ శాలలు ఏర్పాటు చేసి బుద్ధుని రాకకై వేయికళ్ళతో ఎదురు చూస్తున్నారు.

లిచ్ఛవిరాజుల నమ్మకం వమ్ము కాలేదు. బుద్ధుడు రాజ్యంలో అడుగు పెట్టగానే వర్షాలు పడడం మొదలయ్యింది. వాగులు, వంకలు, చెఱువులు, బావులు అన్నీ నిండాయి. వైశాలి చేరాక బుద్ధుడు ఆనందునికి రత్నసూత్రం చెప్పి ఆ సూత్రాన్ని నగరం అంతటా తిరుగుతూ ఏడుసార్లు పారాయణ చేసి రమ్మన్నాడు. ఆనందుడు నగరంలోని వీధులన్నీ సంచరిస్తూ రత్న సూత్రన్ని పారాయణ చేశాడు. అంటువ్యాధులు మాయమయ్యాయి. ప్రజలను బాధల నుండి కాపాడింది కనుక రత్నసూత్రానికి పరిత్రాణం (Protection) అనే పేరు ఏర్పడింది. తరువాతి కాలంలో రత్నసూత్రం లాంటి మరికొన్ని సూత్రాలను కూడా పరిత్రాణములుగా భావించి పారాయణ చేయడం అమలులోకి వచ్చింది. ఉదాత్త అనుదాత్త స్వర నియమాలను పాటించి ఒక లయబద్ధంగా పరిత్రాణ సూత్రాలను పారాయణ చేస్తే ఒక విధమైన ప్రకంపనములు ఉత్పన్నమై ఆశించిన ఫలితాలు కొద్దో గొప్పో కనబడడం జరుగుతుంది.

వైశాలిలో ఆమ్రవన ఆరామంలో బుద్ధుడుండగా ఒకనాడు బోధిరాజకుమారుడు అక్కడికి వచ్చి. తాను నూతన గృహప్రవేశం చేస్తున్నానని బుద్ధుడూ భిక్షు సంఘమూ వేంచేసి అనుగ్రహించవలసిన దిగా కోరాడు. బుద్ధుడు సమ్మతించాడు.

("ధర్మపదం కథలు" అనుబంధంలో మంత్రశక్తి శీర్షిక పరిత్రాణముల మీదనే. మగధనుండి లిచ్ఛవి రాజ్యంలోకి పోవాలంటే గంగను దాటవలసియుంటుంది. గంగానది ఒడ్డున ఉన్న పాటలి గ్రామం రేవు ద్వారానే రెండు రాజ్యాల మధ్య గంగానది మీది రాకపోకలు జరిగేవి. ఆ గ్రామం యొక్క అదృష్టమేమని చెప్పాలో! బింబిసారుని కుమారుడు అజాతశత్రువు లిచ్ఛవి రాజ్యాన్ని వశం చేసుకొనే ఉద్దేశంతో మంత్రి వర్షకారుణ్ణి పాటలికి పంపి అక్కడ కోటను నిర్మించమన్నాడు. ఆ కోట నిర్మాణం జరుగుతున్న సమయంలోనే బుద్ధుడు చివరిసారిగా పాటలి మీదుగా గంగానదిని దాటింది. ఆయన గంగానదిలో కాలుపెట్టిన చోటు వర్షకారుడు గుర్తు పెట్టుకొని ఒక తోరణం నిర్మించి గౌతమద్వారం అని పేరు పెట్టాడు. పాటలిలో విడిది చేసినపుడు బుద్ధుడు ఆ పరిసరాలను చూసి "అచిరకాలంలోనే ఇక్కడొక నగరం ఏర్పడుతుంది. కొన్ని వందల ఏండ్లు దేశ నగరాల్లో మేటి నగరంగా వర్ధిల్లి అంతరించి పోతుంది. నగర నాశనం జలం వల్ల, ఆ తరువాత అగ్ని వల్ల" అన్నాడు. వర్షకారుడికి గౌతముని పట్ల విశేష గౌరవం, భక్తి ఉన్నా ఆ భవిష్యవాణిని పెద్దగా పట్టించుకోలేదు. "ఈ పల్లెటూరు పెద్ద నగరం కావడం ఏమిటి? ఇక్కడ చిన్నకోట నేనే కట్టున్నా.

ఈ కోట వల్ల ఇది ఒక నగరం అయిపోతుందా? దేశంలో మూల మూలలా దిక్కుమాలిన కోటలున్నాయి. అవి నగరాలయ్యాయా?" అనుకొన్నాడు. స్థల మహత్యం మాంస చక్షువులకు కనబడేది కాదు. బెస్తలుండే ఆ కుగ్రామమే ఆ తరువాత పాటలీపుత్రంగా రూపాంతరం చెంది మగధ రాజధానిగా మారి ఆ తరువాత కొన్ని వందల ఏండ్లు దేశరాజధానిగా వర్ధిల్లి నగరాలకు కూడా జన్మ వ్యాధి జరా మరణాలు న్నాయని నిరూపిస్తూ దిబ్బలో కలిసిపోయింది.)

ఈ వరకే ఉన్న భవనానికి ఏం లోపం వచ్చిందని బోధిరాజకుమారుడు మయసభలాంటి ఆ కొత్త భవనం కట్టుకొన్నాడో మనకు తెలియదు. అతనూ అతని భార్య కాంతిమతి తక్క ఇంకెవరూ లేరు ఉండడానికి. అంత పెద్ద భవనం ఎందుకో? బుద్ధుని రాకకోసం మహాద్వారం వద్దే నిలబడి ఎదురు చూస్తున్నాడు. అతని హృదయంలో ఏదో ఒక ఆశ. మహాద్వారం ప్రవేశ మార్గంలో చాలా విలువైన ఒక తెల్లని వస్త్రాన్ని పరచాడు. బుద్ధుడు ఆ వస్త్రం మీద కాలు పెడితే తనకు సంతానయోగం ఉంది అనుకొన్నాడు. ఏ హేతువు ఆధారంగా అతను అలా అనుకొన్నాడని ప్రశ్నించడానికి లేదు. అది కేవలం అతని పిచ్చి నమ్మకం. బుద్ధుడు వస్త్రం మీద కాలు పెట్టలేదు. ఆనందునిచేత దాన్ని తొలగింపజేసి లోనికి కాలు పెట్టాడు. బోధిరాజ కుమారుడు విచార వదనంతో బుద్ధుణ్ణి అనుసరిస్తూ వెనకనే నడిచాడు. భవనంలోకి వెళ్ళాక బుద్ధుడు అతణ్ణి సముదాయిస్తూ "బోధిరాజా, విచారించకు. నీకు సంతాన ప్రాప్తి లేకపోవడానికి కారణం పూర్వజన్మ కర్మ విపాకమే.

***న ప్రణశ్యంతి కర్మాణి కల్పకోటిశతైరపి    సామగ్రిం ప్రాప్య కాలం చ ఫలంతి దేహినామ్***

"వందకోట్ల కల్పాలైనా సరే చేసుకొన్న కర్మ, ఫలం ఇవ్వకుండా నశించదు. అనుకూల పరిస్థితులు ఏర్పడగానే ఫలాన్ని ఇచ్చివేసి అది నశిస్తుంది.

"నీవు పూర్వం ఒకొనొక జన్మలో భార్యా సమేతంగా ఒక నావలో పయనించావు. ఒక చిన్న దీవి సమీపంలో ఆ నావకు విపత్తు సంభవించింది. నీవు, నీ భార్య ఎలాగో ప్రాణాలతో ఆ దీవి చేరారు. మీ ఆకలి బాధ పోగొట్టే ఆహారం ఆ దీవిలో లేదు. చెట్లల్లోని పక్షిగూళ్ళ నుండి అండాలను సేకరించుకొని తింటూ బ్రతికారు. ప్రాణం నిలుపుకోవడం జీవధర్మమే అయినా మీరు ఒక్కసారి కూడా కౌకృత్యం (regret)చెందలేదు. ఆ పాపమే మిమ్మల్ని ఈ జన్మలో సంతాన విహీనులుగా చేసి దెబ్బ తీసింది. బ్రహ్మసహంపతి వచ్చినా ఈ కర్మ నియతి నుండి మిమ్మల్ని తప్పించలేడు. కనుక పరిహరించడానికి వీలుకాని విషయంలో విచారించవలసిన పనిలేదు. మీ సంపదను పేదపిల్లల అనాథపిల్లల సంక్షేమానికి వినియోగించండి. ఆ పిల్లల ముఖ వికాసం చూస్తూ మీరూ ఆనందించండి" అని క్రింది శ్లోకం చెప్పాడు.

**ఆత్మనైవ కృతం పాపం ఆత్మజమాత్మ సంభవమ్**
**అభిమథ్నాతి దుర్మేధసం వజ్రమివాశ్మ మయం మణిమ్** 12-5

తన పాపానికి (Misery)తానే కర్త. అది తన వల్లే పుట్టుంది. తనవల్లే కలుగుతుంది. ఏ మణిశిల నుండి వజ్రం ఏర్పడిందో ఆ మణిశిలనే అది నూరివేయగలుగుతుంది కదా! అలాగే దుర్మేధనుని (Unwise) స్వయంకృతములున్నూ.

**Note :** పరిత్రాణవనంలోకి (బుద్ధుని ఉపదేశాల్లోకి) ప్రవేశించాను. రకరకాల ఔషధవృక్షాలు, గుల్మాలు, లతలున్నాయి. ఏది దేనికి పనికి వస్తుందో నాకు తెలియదు. అక్కడొక ఆకు ఇక్కడొక ఆకు గిల్లి ఓ పిడికెడు ఆకులు పాఠకులకు ఇస్తున్నాను. ఉపకారం జరుగుతుందో జరుగదో తేలియదు గానీ అపకారం మాత్రం జరుగదు.

# రసిక కుమార చరిత్రము

## మహా భక్త విజయం

### అష్ట విధ భక్తులు కలవాడు విప్రుడు

రసిక కుమారునకు భగవద్భక్తుల పాదతీర్థ సేవనము సకల పాపములకు ప్రాయశ్చిత్తమనెడి బుద్ధిమంతుల, పెద్దల మాట యందు మిక్కిలి విశ్వాసము కలదు. పుణ్యరాశి అయిన రసికకుమారుడు నిరంతరము భగవంతుని ధ్యానించు, ఆరాధించు భగవద్భక్తుల పాద తీర్థమును ప్రతి దినము స్వీకరించుచుండెను. ఎడతెగక భగవన్నామ సంకీర్తనము చేయుచు జనులకు హితోపదేశము చేయుచు కాలము గడుపుచుండెడివాడు. అతని నిష్ఠయే అతనికి పరమానందముగా ఉండెడిది.

అతనికి ఒకనాడు భాగవతుల పాదతీర్థము తీసుకొనుటకు వీలుపడని సందర్భము వచ్చెను. కావున తన మిక్కిలి అంతరంగ శిష్యుని పిలిచి వారి పాదతీర్థమును తీసుకొని రమ్మనమని పంపెను శిష్యుడు తెచ్చిన తీర్థమును స్వీకరించి "నాయనా యీ తీర్థము రోజూ వలె మధురముగా లేదు. నీవు రోజూ భాగవతుల వద్దకు నేను పోవునపుడు నాతో కూడ వచ్చుచున్నావు కదా! ఈ క్రమమును చూచుచునే యున్నావు కదా అని నేను యీతీర్థమును స్వీకరించవలసిన పద్ధతిని నేర్పలేదు. ఏదో క్రమము తప్పినదని నాకు అనిపించుచున్నది. కావున యీ పాదతీర్థము ఎటుల సేకరించవలెనో నీకు తెలిపెదను వినుము.

మనకు భగవద్భక్తుల యందు వాత్సల్యమండవలెను. శాస్త్రమునకు విరుద్ధముగా తనకు తోచిన రీతిగా ప్రవర్తించువారికి సిద్ధి సుఖము, పరలోక ప్రాప్తి లేదని తెలిసి, శాస్త్రములను నమ్మి, శాస్త్రవిహితములను, శాస్త్రనిషిద్ధములను తెలుసుకొని, శాస్త్ర ప్రకారము నడువవలెనను భగవదాజ్ఞకు లోబడి జాగరూకులై వారు నడచుచుందురు. అట్టి వారి యందు దోషము కలుగుటకు అవకాశము లేదు. పంచభూతములచే నిర్మితమైన శరీరము వలన ప్రమాదవశాత్తు ఏదైన కొంచెము దోషము కలుగవచ్చును. అయినను ఆవు తన దూడ నున్న మలినమును ప్రేమగా నాకునట్లు, ప్రకృతి వశమున కలిగిన శారీరక దోషములను పట్టించుకొనరాదు. అట్లు వారిని చూచుట **మొదటి భక్తి** ఇతరులు చేయు భగవద్భక్తుల సేవలను, పూజలను జూచి అసూయ పడకుండట **రెండవ భక్తి** మనకు భగవంతుడిచ్చిన కర చరణ కాయములను యింద్రియ సుఖములకుపయోగించక, నిరంతరము భగవదారాధనకై అర్పించుట **మూడవ భక్తి**. భగవంతుని సేవ చేయువారు, ఆ సేవ భగవంతుని ప్రీతి కొరకే యని అది తనకు తగినదనియు చేయవలెను కాని ఆడంబరము కొరకు చేయరాదు. తాను చేసిన ధర్మకార్యములను తానే చెప్పిన అది బూడిదలో పోసిన నెయ్యి అగును. తన్ను తాను పొగడుకొనుట ఆత్మహత్యవంటిది. ధర్మరాజును నిందించిన అర్జునుడు, అందుకు ప్రాయశ్చిత్తముగా శ్రీకృష్ణుని సలహాతో ఆత్మహత్యకు బదులుగా తన్ను తాను పొగుడుకొని ఆదోషమును నివారించుకొనెను. ఇట్లు ఆత్మస్తుతి చేసుకొనకుండుట **నాలుగవ భక్తి**. ఎన్ని సార్లు వినినను భగవద్భక్తుల కథలు నూతనముగా తోచి, ఆనందించుట **అయిదవ భక్తి.** భగవంతుని దివ్యచరిత్రమును వినునప్పుడును, అతని కళ్యాణగుణములను తలచినను, గద్గద కంఠము, ఆనందబాష్పములు కలుగుచుండవలెను. యిట్లు ఆనంద బాష్పములు, రోమములు నిక్కబొడుచుకొనుట **ఆరవ భక్తి**. తైలధార వలె నిరంతరము భగవంతుని స్మరించ చుండవలెను. లేని యడల చంచల మనస్సు ప్రాపంచిక విషయములపై మరలును. అర్జునుడు చెప్పినట్లు మనస్సు లోబరచుకొనుట వాయువును పట్టుకొనుట వంటిది. చలింపని మనస్సుతో ఎల్లప్పుడు భగవంతుని స్మరించుట **ఏడవ భక్తి**. భగవంతుని అచంచలభక్తితో, నిష్కాముడై, పతివ్రత తన భర్తని సేవించినట్లు, తన ధర్మమని భర్త భార్యని రక్షించినట్లు ప్రతిఫల మాశించక భగవంతుని ఆరాధించవలెను. భక్తికి ఫలము కోరువాడు వ్యర్థుడు. ఈ విధముగా ప్రయోజనమును కోరక

భగవంతుని ఉపాసించుట భక్తునికి, భక్తుని నుండి ఏమీ కోరక భక్తుని రక్షించుట ఈశ్వరునికి ధర్మములు. తాను చేయు సేవ నందు ఎటువంటి ఫలాపేక్ష లేకుండుటయే **ఎనిమిదవ భక్తి** ఈ అష్టవిధ భక్త లక్షణములు మ్లేచ్ఛుని యందు వున్నను వాడు విప్రుడగును.

సకల వేదసారమైన అష్టవిధ భక్తులు కలవాడు **విప్రుడగుచున్నాడు** వీడే యింద్రియములను జయించి తన మనోవిమానము నందు భగవంతుని ప్రతిష్ఠించి ఎడతెగక అతనినే మననము చేయుటచే **ముని** అగుచున్నాడు. ఇంటిలో ఎలుకలు కలుగులు చేసుకొని అవి తమ స్వంత గృహములుగా భావించును. అట్లే భగవంతుని సృష్టిలో కొన్ని వస్తువులను తమ స్వాధీనము చేసుకొని అవి తమ స్వంతమని తలచువారు దురభిమానులు అఖిలజగన్మాత శ్రీమహాలక్ష్మియని, అఖిల భువన సృష్టిస్థితిసంహార కర్తయగు జనార్దనుడు తనకు తండ్రియని నిరంతరము యీశ్వరుని సన్నిధిని అనుభవించుచు, ద్వేషరహితులైన విష్ణుభక్తులందరు తన బంధువులని, భగవంతుని సంపదయగు జగత్రయము అంతయు తనదని భావించుటచే **శ్రీమంతుడగును** భగవంతుని దాసుడనగు తనకు తన దేహసేవ తనకే హాని యని నరక కారణమని, భగవదనుభవమునకు ఆటంకమని, భోగలాలస విషసర్పము వంటిదని తెలుసుకొని దానిని విడచి, తన జన్మకు తగిన భగవన్నిష్ఠను అనుసరించువాడు **యతి** అన బడును. సకల శాస్త్ర సారమగు మంత్ర మంత్రార్థ, మంత్రాధి దేవతలను, యీ మూడిటి నిజమైన జ్ఞానము వీని చేతియందుండుటచే **పండితుడగును**

అట్టివారిని కుల గోత్రములను చూడక అతని యందుగల విశేష గుణములను గ్రహించవలెను. అతనిని భగవంతునిగా యెంచి పూజించవలెను. ఈ అష్టవిధ భక్తులు ఎవని యందు వున్నవో, అట్టి మహాత్ముని శ్రీపాదతీర్థమును స్వీకరింపవలయును. అట్టి భక్తులు తమను తాము నీచులలో కెల్ల నీచులమని తలచుచుందురు. కావున తమ పాదతీర్థమిచ్చుటకు సమ్మతింపరు ఎన్నో విధములుగా వారిని ప్రార్థించి ప్రసన్నునిని చేసుకొనవలెను. భగవంతుని విగ్రహమనెడి భావనతో గురు పరంపరాను పద్ధతిలో అతని పాదములు కడిగి ఆ తీర్థమును స్వీకరింపవలెను. అతని కులగోత్రములు, శాస్త్రపాండిత్యము, శరీరారోగ్యము లెక్కచేయక, అతడెటు వంటి వాడైనను అతనిలోని అష్టవిధ భక్తి సంపదలను గౌరవించి అతని పాదోదకమును స్వీకరించవలెను. ఈ విధానమును నీకు జెప్పక నిన్ను యీ పనికి వినియోగించినందున నీవు ఏపొరపాటు చేసితివో నాకు తెలియదు. రోజూ వలె కాక యీ తీర్థము మధురముగా లేకపోవుటచే ఏదో ఒక ప్రమాదము జరిగినదని రసిక కుమారుడనెను. భాగవతులందు ఒక కుష్టువ్యాధి పీడితుడుండుటచే, అతని శరీరము మిగుల హేయమై దుర్గంధముతో నుండుటచే అతని పాదములు కడుగుటకు అసహ్య పడి మిగిలిన వారి పాద తీర్థము తెచ్చితినని శిష్యుడు చెప్పెను, అది విని రసిక కుమారుడు చాల బాధపడి, ఆకుష్టువ్యాధి గల భాగవతుని భగవద్విగ్రహముగా భావించి గౌరవించి, అతని పాదములను కడిగి ఆ నీటిని మునపటి తీర్థములో కలిపి త్రాగగా, అది అత్యంత మధురముగా నుండెను. అది చూచిన వారందరు అతని భావశుద్ధికి ఆశ్చర్యపడి అతనిని సార్థక నామదేయుడని పొగడిరి.

జ్ఞానవైరాగ్య సంపన్నుడు, సుశీలుడు, అనవరతము భగవరాధనాపరుడు నగు దయార్ణవస్వామి రసిక కుమారునకు ఆచార్యుడు, ఆదేశాధిపతి దయార్ణవస్వామికి భగవదారాధన నిమిత్తం కొంత భూములనిచ్చెను. కొత్తగా వచ్చిన రాజు పరమ నాస్తికుడు, సాధుజన ద్వేషి అగుటచే, నిర్దయగా ఆభూములను స్వాధీనము చేసుకొనెను. దయార్ణవ స్వామి తన శిష్యుడెన రసిక కుమారుని పిలిచి తిరిగి ఆభూములను తన ఆధీనమునకు వచ్చునట్లు రాజునకు చెప్పమని చెప్పెను. రసిక కుమారుడు రాచనగరుకు పోయి తన శిష్యునితో తన రాకను రాజుకు తెలియజేసెను. రాజసభలో వారందరు రసిక కుమారుని వైరాగ్యాది గుణములను పొగడి అతని దర్శన మాత్రమున పశుపక్ష్యాదులకు కూడ జ్ఞానోదయ మగునని తెలిపిరి.

ఆ రాజు రసిక కుమారుని మరునాడు రమ్మనమని చెప్పెను. గజాధ్యక్షుని పిలిపించి ఒక యేనుగుకు సురాపానము చేయించి రసిక కుమారుడు వచ్చునపుడు అతని మీదకు ఆ యేనుగును నడిపింపుమని ఆజ్ఞాపించెను. ఇది తెలియని రసిక కుమారుడు మరునాడు తన శిష్యులతో భగవన్నామ సంకీర్తన చేయుచు కోటలోనికి ప్రవేశించెను. మదగజము అతని పైకి వచ్చెను రసిక కుమారుని వెంటనున్న శిష్యులు, పురజనులు భయపడి భవనముల పైకి పరుగెత్తిరి. "ప్రజలార శ్రీకృష్ణపరమాత్మను జూచి సంతసింపక ఏల భయపడెదరు? ఒక పురుషుడు కవచమును ధరించినంత మాత్రమున వాని పురుషత్వము తొలగి కవచలక్షణములు రావుగదా! సర్వశరీరుడగు భగవంతుడు యీ యేనుగును తన శరీరముగా తీసికొనినాడు. శరీరమందున్న భగవంతుని గుర్తించక అతని శరీరముగు యేనుగును చూచి భయపడుచున్నారు. శరీరిని విడచి శరీరము స్వతంత్రించి ఏమీ చేయలేదు. మీకు తెలియకుండా మీ శరీరము స్వతంత్రముగా ఏపనినైనను చేయునా? మీకేల యింత వివేకము లేకపోయెను అనెను. ఆ యేనుగుకు తలవంచి నమస్కరించి తామర కన్నులవంటి భగవంతుడా రమ్మురమ్మని పిలిచెను. భగవత్కృపచే ఆయేనుగు మదము నశించి శమాదిగుణములు కలుగగా రసిక కుమారుని పాదములకు నమస్కరించెను. ఆమహానుభావుడు దాని తలపై తన చేతినుంచి, తన మెడ నుండి తులసిమాలను తీసి దాని మెడలో వేసి, దాని చెవిలో తారక మంత్రము వుపదేశించెను. ఆ యేనుగు ఆనంద బాష్పములు విడచుచు, భగవంతుని స్మరించుచు రసిక కుమారుని వెంబడించెను ఈ అద్భుతమును విన్న కొత్తరాజు అతని సన్నిధికి వచ్చి అతని పాదములపై తన తలనుంచి అపరాధక్షమార్పణలను వేడెను. తను స్వాధీనపరుచుకొనిన మాన్యపు భూములను తిరిగి దయార్ణవస్వామికి ఆధీనము చేసి వుపదేశమును పొందిన యేనుగును రసిక కుమారునికి కానుకగా నిచ్చి అతనిని పూజంచి పంపెను.

అది మొదలు ఆయేనుగు అతని అడుగుజాడ అన్నట్లు రసిక కుమారుని వెంబడి తిరుగుచు, ఎడతెగక భగవన్నామము చేయుచుండెను. భగవన్నామము చేయు సాధువుల యందు స్నేహ భావముతో నుండెను. రసిక కుమారుడు యాత్ర చేయునపుడు అతని, అతనితో నున్న సాధుజనులు భగవత్ప్రసాదము తినుచు ఆనందించుచుండెను. ఒక తీర్ధయాత్రలో రసిక కుమారుని అతని బృందమును దొంగలు చుట్టు ముట్టగా, తన తొండముతో కాళ్ళతో వారిని సంహరించెను. వీరందరు కురుక్షేత్రమును చేరి అచటి పుణ్యతీర్థమున స్నానము చేయుచుండగా అచటి రాజు సర్వలక్షణములతోనున్న ఆ యేనుగును తనకు యీయవలసినదిగా తన భటులను పంపెను రసిక కుమారుడు యేనుగు తనను, భాగవతులను విడచి మరొక చోటుకు పోదని బదులిచ్చెను ఆరాజు తన భటులను సాధు వేషములతో భగవన్నామము చేయుచు ఏనుగును పట్టుకు రమ్మని ఆజ్ఞాపించెను. ఏనుగు భగవన్నామోచ్చారణచే సాధు వేషధారులను ఏమి చేయక వూరకుండెను. భటులు ఆ ఏనుగును గజశాలకు చేర్చిరి ఆ ఏనుగు అదిమొదలు నిద్రాహారములు విడచి గురుపాదపద్మముల స్మరణలో యుండెను.

ఇంతలో రాజుకు భరింపరాని కడుపునొప్పి వచ్చి, ఎన్ని మందులు వాడినను తగ్గక ఇంకా ఎక్కువగుచుండెను. అప్పుడారాజు భయపడి భాగవతునికి అపచారము చేయుట చేతనే తన కట్టి బాధ కలిగినదని గ్రహించెను. రసిక కుమారుని వద్దకు వచ్చి, భయభక్తులతో ప్రదక్షిణ నమస్కారములు చేసి అపరాధ క్షమార్పణ కోరెను అతని అనుయాయుడై అతని శిష్యుడై ఉపదేశమును పొందెను. ఆయేనుగు తన గురువు చెప్పినట్లు గంగలో మరణించుట ముక్తిప్రదమని భాగీరథీ నదికి పోయి, తన శరీరమును విడచి శ్రీ వైకుంఠ దివ్యలోకమును పొందెను. విష్ణువును ఆశ్రయించిన మనుష్య పశుపక్ష్యాదులు పరమ పదమును చెందుదురను ప్రమాణ వాక్యము యీ పరమ భాగవతుని యందు నిరూపించబడెను. ఈ రసిక కుమారుని వుపదేశముచే పెక్కుజనులు పరమ వైరాగ్య సంపన్నులై ముక్తిని పొందిరి.

**(పై కథ "మహాభక్త విజయం" నుండి సరళ భాషలో గ్రహించబడినది)**

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు :State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001

A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 – 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి – 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266–271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ – 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం–533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

# కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 3.5.2022 (మంగళవారం) :** ఉ ॥ 7.30 గం॥లకు అక్షయ తృతీయ సందర్భంగా శ్రీ లక్ష్మీ నృసింహ అష్టోత్తర శతనామార్చన

**తేది 5.5.2022 (గురువారం) :** శ్రీ ఆది శంకరుల జయంతి సందర్భంగా శ్రీ ఆది శంకరుల అష్టోత్తర శత నామార్చన

**తేది 8.5.2022 (ఆదివారం) :** స్వామి చిన్మయానంద జయంతి

**తేది 14.5.2022 (శనివారం) :** నృసింహజయంతి సందర్భంగా ఉ॥ 7.30 గం॥లకు శ్రీ లక్ష్మీ నృసింహ అష్టోత్తర శతనామార్చన

**తేది 16.5.2022 (సోమవారం) :** బుద్ధజయంతి (వైశాఖ పూర్ణిమ)

**తేది 25.5.2022 (బుధవారం) :** శ్రీ హనుమన్ జయంతి సందర్భంగా ఉ॥ 7.30 గం॥లకు హనుమన్ అష్టోత్తర శత నామార్చన, ఏకాదశ హనుమన్ చాలీసా పారాయణము.

జ్ఞాని తాను చేసే కర్మకు తాను కర్తను అనిగాని, చెయ్యని దానికి అకర్తను అనిగాని భావించడు. అంటే కర్మను చేశాను అనికాని కర్మచేయడం మానేశాను అనికాని తలంపు జ్ఞానికి కలుగదు.

**శ్రీ రమణ మహర్షి**

# శాశ్వత అన్నదానం

1. శ్రీమతి మంత్రి సూర్య భార్గవి గారు (సికింద్రాబాద్) 1,05,000/-
   వీరి కుమారుడు దబ్బీరు సుమంత్ గారి జ్ఞాపకార్థం
2. శ్రీ తలపంటి వరహాలు గారు (తలపంటిపేట) 10,000/-
   వీరి ఆయురారోగ్యములు కోరుతూ
3. శ్రీ సిద్దినేని నాగేశ్వరరావు గారు (మచిలీపట్నం, రాజుపేట) 10,500/-
   వీరి మనుమడు కీ॥శే॥ దినేష్ బాబు గారి జ్ఞాపకార్థం
4. శ్రీ రాజు గోవర్ధన్ ఇళ్ళగారు శ్రీమతి శారద గారు(హైదరాబాద్) 25,000/-
   వీరి పెండ్లి రోజు సందర్భముగా

## విరాళములు

1. శ్రీ వి. సుబ్రహ్మణ్యం గారు (ఈరోడ్) గోగ్రాసం నిమిత్తం 10,001/-
2. శ్రీ వియ్యపు హనుమంతరావు గారు (శాంతి ఆశ్రమం) 5000/-
   దిగువ ప్రార్థనా మందిరం గ్రిల్ నిమిత్తం
3. శ్రీమతి జి.బి.ఎస్. లక్ష్మి గారు, కెరాఫ్. వై. హేమగారు 8000/-
   వీరి కుమారుడు శ్రీ జి. రామమూర్తి గారు (విశాఖపట్నం) పుట్టినరోజు సందర్భముగా
4. శ్రీమతి చనుమోలు సుచరిత గారు (విజయవాడ) 5000/-
   పూజలు పండుగలు నిమిత్తం
5. శ్రీమతి మంత్రి సూర్య భార్గవి గారు (సికింద్రాబాద్) 90,000/-
   గోగ్రాసం నిమిత్తం
6. ఆనందాశ్రమం ట్రస్టు (కన్హన్‌గాడ్) 20,000/-
7. శ్రీ డి. ఓంకార్ సాయి ప్రసాద్ గారు (శాంతి ఆశ్రమం) 25,000/-
   సన్ ఆఫ్ లేట్ డి.వి.ఆర్. ఆంజనేయులు గారు
   దిగువ ప్రార్థనా మందిరం గ్రిల్ వేయుటకు
8. శ్రీమతి దూళిపూడి దుర్గమ్మ గారు (శాంతి ఆశ్రమం) 20,000/-
   వీరి భర్త గారు కీ॥శే॥ డి.వి.ఆర్. ఆంజనేయులు గారి సంవత్సరీకం
   సందర్భముగా అన్నదానం

9. శ్రీమతి సి. హెచ్. సుచరిత గారు (విజయవాడ) 5000/-
దిగువ ప్రార్ధనా మందిరమునకు గ్రిల్ వేయుటకు
10. సి. హెచ్. వెంకటేశ్వరరావు గారు (శాంతి ఆశ్రమం) 10,000/-
దిగువ ప్రార్ధనా మందిరమునకు గ్రిల్ వేయుటకు
11. శ్రీమతి అల్లూరి లక్ష్మి నరసయ్య గారు (శాంతి ఆశ్రమం) 10,000/-
దిగువ ప్రార్ధనా మందిరమునకు గ్రిల్ వేయుటకు
12. శ్రీమతి పందిరి లక్ష్మి గారు (శాంతి ఆశ్రమం) 10,000/-
దిగువ ప్రార్ధనా మందిరమునకు గ్రిల్ వేయుటకు
13. శ్రీ ఎమ్. రామతేజ గారు (గొల్లప్రోలు) పిల్లల సంక్షేమ నిమిత్తం 6000/-
14. శ్రీ గణేష్ చరణ్ ఆచార్య గారు (శాంతి ఆశ్రమం) 5000/-
దిగువ ప్రార్ధనా మందిరమునకు గ్రిల్ వేయుటకు
15. శ్రీ ఎస్.ఎ.రావు గారు (కలకత్తా) శ్రీమతి టి. కృష్ణ కుమారి గారు 3000/-
(శాంతి ఆశ్రమం) వీరి అన్నయ్య గారు కీ॥శే॥ వెంకట ఆదినారాయణ సారిక గారి
ప్రథమ వర్ధంతి సందర్భముగా
16. శ్రీ దాట్ల రవిరాజు గారు (రాజమండ్రి) 10,000/-
17. శ్రీ సిద్ధినేని నాగేశ్వరరావు గారు (మచిలీపట్నం, రాజుపేట) 5000/-
వీరి మనుమడు కీ॥శే॥ దినేష్ బాబు గారి జ్ఞాపకార్ధం
18. శ్రీ పి. సత్తిబాబు గారు శ్రీమతి వెంకటలక్ష్మి గారు (తూరంగి) 10,000/-
వీరి కుమారుడు చి॥ సత్య సూర్య వెంకట సాయి చంద్రశేఖర్
చి॥ల॥సౌ॥ లలిత ప్రియ గార్ల వివాహము సందర్భముగా
19. చి॥ హసిత ఇళ్ళ గారు డాటర్ ఆఫ్ రాజు గోవర్ధన్ ఇళ్ళ గారు 5000/-
(హైదరాబాద్)
20. శ్రీ పి. హరికుమార్ శర్మ గారు (శాంతి ఆశ్రమం) 4,250/-
21. శ్రీమతి నాగ వెంకట లక్ష్మి రేణుక గారు (కాకినాడ) 5000/-
చి॥ శ్రీ పాద శివ నాగ వెంకట వాసవి గారి పుట్టినరోజు సందర్భముగా
22. డా॥ కృష్ణరాం భరతుల గారు (ఢిల్లీ) సోలార్ పెన్సింగ్ నిమిత్తం 76000/-

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......................... Rs. 10/-
3. Soham .......................................................................... Rs. 10/-
4. Cosmic Fast .......................................................................Rs. 20/-
5. Meditation.........................................................................Rs.10/-
6. Om Japa ...........................................................................Rs.10/-
7. Control of Mind .................................................................Rs.30/-
8. Cosmic Flashes .................................................................Rs.10/-
9. In the Hours of Silence ...................................................... Rs.10/-
10. The Soul of Omkar ...........................................................Rs.10/-
11. How I learned English .......................................................Rs.10/-
12. Reincarnation of my Little Sister ........................................Rs.10/-
13. God Realization Now and Here ..........................................Rs.10/-
14. Mystic Prayers and Poems .................................................Rs.20/-
15. The Divine Voice of Omkar .................................................Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) .............Rs.100/-
17. Petals of Peace ..................................................................Rs.20/-
18. The Story of my life and Work ...........................................Rs.10/-
19. Priceless legacy of Swami Omkar .......................................Rs.10/-
20. The Four Initiations ..........................................................Rs.10/-
21. Musings ............................................................................Rs.20/-
22. Peace Prayer .....................................................................Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org

Printed Book

To

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.